

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL  ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి  శుక్రవారం 21 జనవరి 2022  సంపుటి: 03  సంచిక: 142  పేజీలు: 4  వెల: రూ 3-00

## రివర్స్ పీఆర్సీ అంటూ

# కదం తొక్కిన ఏపి ఉద్యోగులు

**జగన్ విధానాలపై మండిపడ్డ ఉద్యోగ సంఘాలు**
**కలెక్టరేట్ల ముందు ఆందోళనలతో ఉద్రిక్తత**
**ఎక్కడికక్కడే ఉద్యోగులను అరెస్ట్ చేసిన పోలీసులు**
**కలెక్టరేట్ ముందుకు రాకుండా ముందే నిర్బంధాలు**



అమరావతి,జనవరి20(): పిఆర్సికి వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కదం తొక్కారు. తమకు అన్యాయం జరిగిందంటూ జిల్లాల్లో ఆందోళనలకు దిగారు. జగన్ సర్కార్‌కు వ్యతిరేకంగా వీధులకెక్కి నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పిఆర్సీని నిరసిస్తూ గురువారం అన్ని జిల్లా కలెక్టరేట్ల ముట్టడికి ఫ్యాప్టో పిలుపునిచ్చిన నేపథ్యంలో చలో కలెక్టరేట్ కు బయలుదేరిన ఉపాధ్యాయ సంఘాల నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో ఆయా స్టేషన్ల ఎదుట కూడా ఉపాధ్యాయులు సంఘాల నేతలు తమ నిరసనలు చేపట్టారు. పీఆర్సీపై ఏకపక్ష జీవోలు జారీ చేసిన జగన్ ప్రభుత్వంపై ఏపీ ఉద్యోగ సంఘాలు సమరానికి సిద్ధమయ్యాయి. సమ్మె అస్త్రాన్ని ప్రయోగించ నున్నాయి. అంతేకాదు.. గురువారం అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముట్టడికి పిలుపు ఇచ్చాయి. దీంతో ఆందోళన కారులను పోలీసులు మార్గమధ్యంలో ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై పాట రూపంలో నిరసన తెలిపారు. మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రిగారూ....ఉద్యోగులకిచ్చిన చేతిబాసలు ఏమాయే సారూ.. ముద్దుల మీద ముద్దులు పెట్టిన ముఖ్యమంత్రిగారూ....మీ పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలుపుకోండి మీరు అంటూ పాటపాడారు. మహిళలు, ఇతర ఉద్యోగులతో సమానంగా ఆందోళనలో కదం తొక్కారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన పిఆర్సీని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలివచ్చి ఈ నిరసనలో పాల్గొన్నారు. ఏపీ ఉద్యోగ ఉపాధ్యాయ ఆకాశ కూడా ఈ ఈ ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ ఉద్యోగులు కూడా నిరసనలో పాల్గొన్నారు. ప్రొద్దుటూరు నుండి కడపకు కలెక్టరేట్ కు బయలుదేరిన ఉపాధ్యాయులను కొత్తపల్లె రహదారి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన ఉపాధ్యాయ సంఘ నేతలకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించించారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ వద్దకు ఉపాధ్యాయ సంఘం నేతలను రాకుండా అడ్డుకోవ టంతో ఒక్కొకరుగా ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. మచిలీపట్నం కలెక్టరేట్ ముట్టడికి పిలుపిచ్చాయి. దీంతో ఆందోళన కారులను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకుంటున్నారు. కలెక్టరేట్ వైపు వెళితే అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. మహిళా ఉపాధ్యాయులపై కేసులు పెడతామని బెదిరించారు. అయినా ఉపాధ్యాయులు బారికేడ్లను తోసుకుని ముందుకి వచ్చారు. దీంతో పోలీసులు పలువురిని అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 'జగన్ మాట తప్పారు... మడమ తిప్పారు.. ఎన్నికలకు



ముందు చెప్పిందేమిటి, ఇప్పుడు చేసిందేమిటి.. మా హక్కులను హరించి వేయడం మీకు ధర్మమా... పురోగమనం లేకపోగా తిరోగమన విధానం జగన్ పాలనలోనే చూస్తున్నాం.. పోలీసులను అడ్డం పెట్టుకుని అడ్డుకుంటారా?.. మా న్యాయమైన డిమాండ్‌లను అడిగే హక్కు కూడా లేదా?.. కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం.. మా ఛీఫ్ సెక్రటరీతో కూడా అబద్దాలు చెప్పిస్తున్నారు..

# కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టండి: సీఎం జగన్



అమరావతి: ప్రతి జిల్లాకు ఒక ఎయిర్‌పోర్టు ఉండాలన్నది మంచి కాన్సెప్టు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. వన్ డిస్ట్రిక్ట్–వన్ ఎయిర్‌పోర్టుకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో ఏకరీతిగా విమానాశ్రయాల నిర్మాణం చేపట్టాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సీఎం అధికారులకు సూచించారు.బోయింగ్ విమానాలు సైతం ల్యాండింగ్ అయ్యేలా రన్‌వే అభివృద్ధి చేయాలని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 6 విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధి పనులతో పాటు, రెండు కొత్త విమానాశ్రాయల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం అధికారులకు వివరించారు. విజయనగరం జిల్లా భోగాపురం, నెల్లూరు జిల్లా దగదర్తి విమానాశ్రయాల పనులు త్వరితగతిన పూర్తి కావాలని, ఇందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు.నిర్వహణలో ఉన్న విమానాశ్రయాల విస్తరణ పనులను కూడా ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్దం చేయలని సూచించారు. నిర్ణీత కాల వ్యవధిలోగా పెండింగ్ సమస్యలు పరిష్కారం కావాలని, గన్నవరం విమానాశ్రయం విస్తరణ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం అధికారులకు ఆదేశించారు. రద్దీకి తగినట్లుగా మౌలికసదుపాయాలు, విస్తరణ పనులను వేగవంతం చేయాలని సీఎం జగన్ తెలిపారు. పోర్టులుపైనా సీఎం జగన్ సమీక్ష: రాష్ట్రంలో చేపడుతున్న 9 ఫిషింగ్ హార్బర్లు, 3 పోర్టులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని నిర్మాణం చేపట్టి, పనులు వేగవంతం చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. భావనపాడు, రామాయపట్నం పోర్టుల పనులు త్వరలో ప్రారంభమవుతాయని సీఎంకు అధికారులు వివరించారు. ఫిషింగ్ హార్బర్లు: రాష్ట్రంలోని 9ఫిషింగ్ హార్బర్లలో తొలిదశలో నిర్మాణం చేపడుతున్న 4ఫిషింగ్ హార్బర్లను అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. తొలిదశలో ఉప్పాడ(తూర్పుగోదావరి), నిజాంపట్నం(గుంటూరు), మచిలీపట్నం(కృష్ణా), జువ్వలదిన్నె(నెల్లూరు) జిల్లాల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం, రెండో విడతలో చేపడుతున్న మిగిలిన 5హార్బర్ల నిర్మాణాన్ని నిర్దిష్ట కాలపరిమితిలోగా నిర్మిస్తామని సీఎంకు అధికారులు తెలిపారు. ఈ 5 ఫిషింగ్ హార్బర్లకు త్వరలోనే టెండర్లు ఖరారు చేస్తామని అధికారులు తెలిపారు. ఫేజ్ 2లో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (విశాఖపట్నం), బియ్యపుతిప్ప (పశ్చిమగోదావరి), ఓడరేవు (ప్రకాశం), కొత్తపట్నం (ప్రకాశం) జిల్లాల్లో ఫిషింగ్ హార్బర్లు నిర్మాణం కానున్నాయని అధికారులు సీఎం వైఎస్ జగనకు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, పరిశ్రమలు, వాణిజ్యశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, సీఎఫ్ఎస్ఎస్ సీఈఓ రవిసుభాష్, ఏపీ మారిటైం బోర్డు సీఈఓ కె మురళీధరన్, ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సలహాదారు వీ ఎన్ భరత్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత దేశ ప్రతిష్ఠను చెడగొట్టే ప్రయత్నం జరుగుతోంది : మోదీ



న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా భారత దేశానికిగల కీర్తి, ప్రతిష్ఠలను సర్వ నాశనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. 'స్వాతంత్ర్య అమృత మహోత్సవాల నుంచి సువర్ణ భారత్ దిశగా' కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా బ్రహ్మ కుమారీస్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మన దేశానికి అంతర్జాతీయంగాగల కీర్తి, ప్రతిష్ఠలను నాశనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇవి కేవలం రాజకీయాలు మాత్రమేనని చెప్పుకుంటూ పక్కన పడేయకూడదని మోదీ చెప్పారు. ఇది మన దేశ పరువు, ప్రతిష్ఠలకు సంబంధించిన అంశమని తెలిపారు. భారత దేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి బ్రహ్మ కుమారీస్, ఇతర అంతర్జాతీయ సంస్థలు పోషించదగిన పాత్రను వివరించారు. వివిధ దేశాల ప్రజలకు మన దేశం గురించి సరైన సమాచారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భారత దేశానికి వ్యతిరేకంగా ప్రచారమవుతున్న వదంతులు, పుకార్లపై పోరాడవలసిన బాధ్యత మనందరికీ ఉందని చెప్పారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సే స్వర్ణిమ్ భారత్ కీ ఓర్'లో భాగంగా బ్రహ్మ కుమారీస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మోదీ ప్రశంసించారు.

## దేశంలో చాపకింది నీరులా

# కరోనా వ్యాప్తి

**రోజురోజుకూ పెరుగుతున్న కేసుల సంఖ్య**
**వాస్తవానికి భిన్నంగా కేసుల నమోదు**
**కొత్త వేరియంట్ ఒమిక్రాన్ కూడా తీవ్ర రూపం**
**వ్యాక్సిన్ తీసుకున్న ఆరునెలలపాటు మాత్రమే యాంటీబాడీలు**



న్యూఢిల్లీ,జనవరి20(): దేశంలో కరోనా వ్యాప్తి చాపకింది నీరులా దడ పుట్టిస్తున్నది. కేసులు లేవంటూనే రోజురోజుకూ పెరుగుతున్నాయి.. రికార్డు స్థాయిలో భారీగా పాజిటివ్ కేసులు నమోదవుతున్న తీరు ఆందోళనకరంగా ఉంది. అయితే కేసుల విషయంలో వాస్తవ సంఖ్య భిన్నంగా ఉంటోంది.దేశంలో కరోనాథర్డ్ వేవ్ విజృంభిస్తోందనడానికి ఇదే రుజువని అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూపోతోంది. గడిచిన 24 గంటల్లో రోజూవారి నమోదవుతున్న పాజిటివ్ కేసులసంఖ్య 3 లక్షల మార్క్ దాటింది. దేశవ్యాప్తంగా 3,17,532 కేసులు నమోద య్యాయి. దీంతోపాటు.. ఈ మహమ్మారి కారణంగా 491 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం ఉదయం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. దేశంలో పాజిటివిటి రేటు ప్రస్తుతం 16.41 శాతానికి చేరినట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో 19,24,051 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా నిన్న కరోనా నుంచి 2,23,990 మంది బాధితులు కోలుకున్నారు. దేశంలో కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ సైతం అలజడి సృష్టిస్తోంది. రోజురోజుకూ ఒమిక్రాన్ కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఇప్పటివరకు దేశంలో 9,287 ఒమిక్రాన్ కేసులు నమోదయ్యాయి. మరోవైపు దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు దేశంలో 1,59,67,55,879 మందికి టీకాలు వేసినట్లు కేంద్రం తెలిపింది. గత 24 గంటల్లో 73,38,592 టీకా డోసులు వేసినట్లు కేంద్రం తెలిపింది. ఇదిలావుంటే దేశ వ్యాప్తంగా వివిధ రాష్టాల్లో నమోదైన కొవిడ్ కేసుల జాబితాను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెలువరించింది. అత్యధికంగా మహారాష్ట్రలో 43,697 కేసులు వెలుగు చూశాయి.

# కరోనా గుప్పిట్లో ఏపీ

అమరావతి: ఏపీలో రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో కొత్తగా 12,615 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ రోజు నమోదయిన కేసులతో కలిపి రాష్ట్రంలో 21,40,056కి కరోనా కేసులు చేరాయి. 24 గంటల్లో కరోనాతో ఐదుగురు మృతి చెందారు. ఇప్పటివరకు కరోనాతో 14,527 మంది మృతి చెందారు. ప్రస్తుతం ఏపీలో 53,871 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటివరకు కరోనా నుంచి 20,71,658 మంది రికవరీ అయ్యారు. విశాఖలో ముగ్గురు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున కరోనాతో మృతి చెందారు. భయపడినట్టుగానే రాష్ట్రం మళ్లీ కరోనా గుప్పిట్లోకి చేరుకుంటోంది. రెండు వారాల క్రితం వరకు వంద మార్కుకి పడిపోతూ వచ్చిన కొవిడ్ కేసులు ఒక్కసారిగా వేగం పెంచాయి. నాలుగైదు రోజులుగా రాష్ట్రంలో నమోదవుతున్న కేసుల సంఖ్య చూస్తే ప్రమాద ఘంటికలు మోగుతున్నట్టు అనిపిస్తోంది. ఈ విడతలో విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల్లో పరిస్థితి అదుపుతప్పింది.

# ఉద్యోగుల ఐఆర్‌పై వక్రీకరణలు సరికాదు: పేర్ని నాని



తాడేపల్లి: ఉద్యోగుల ఐఆర్‌పై వక్రీకరణలు సరికాదని రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఉన్న విధానమే ఇప్పుడు అమలు చేశామని చెప్పారు. అన్ని అంశాలు తెలిసి కూడా కొందరు వక్రీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవ పరిస్థితులను ఉద్యోగులు అర్థం చేసుకోవాలని తెలిపారు.గతంలో ఎప్పుడూ లేని విధంగా 27 శాతం ఐఆర్ ఇచ్చామని పేర్ని నాని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన నెలలోపే ఐఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఐఆర్ కింద రూ.17, 918 కోట్లు ఇచ్చామని చెప్పారు. కొత్త పీఆర్సీతో జీతాల్లో కోతపడుతుందనేది అవాస్తవమని మంత్రి తెలిపారు.

# అప్పుడు అంగీకరించి.. ఇప్పుడు ఆందోళనలు సరికాదు: మంత్రి సురేష్

గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీలో ఉద్యోగులు పీఆర్సీకి అంగీకరించారని.. మళ్లీ ఇప్పుడు ఆందోళన చేయడం సరికాదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇబ్బందులుంటే ప్రభుత్వంతో మాట్లాడవచ్చన్నారు. రాష్ట్రంలో స్కూళ్లకు సెలవులు ఇచ్చే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. కొన్ని యూనివర్శిటీలు పరీక్షలు కూడా నిర్వహిస్తున్నాయన్నారు. కోర్టు కూడా పరీక్షలకు అనుమతి ఇచ్చిందన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 21 జనవరి 2022

## బడ్జెట్ కసరత్తు షురూ.....

కరోనా మహమ్మారి విజృంభణతో మునుపెన్నడు లేని సంక్షోభాన్ని భారత దేశం ఎదుర్కొంటోంది. గత రెండేళ్లుగా మూడు విడతల్లో జనానికి చుక్కులు చూపిస్తోంది. మొదటి, రెండో వేవ్‌ల్లో సాధారణ జన జీవనం అస్తవ్యస్తమైంది. ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర బడ్జెట్ ను ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. కరోనా సృష్టిస్తున్న విధ్వంసంతో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిన పెట్టడంతో పాటు, భవిష్యత్తులో విశ్వ యవనికపై భారత పతాకాన్ని రెపరెపలాడించే ఆర్థిక ప్రణాళికపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. స్వల్పకాలం ఊరట కల్పించే పథకాల ప్రకటన కన్నా దీర్ఘకాలంలో దేశాభివృద్ధికి బాటలు వేసే వ్యవస్థీకృత కార్యక్రమాలపై ఈ బడ్జెట్‌లో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.కేంద్ర ప్రభుత్వం 2022-23లో మొత్తం సబ్సిడీని తగ్గించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో ఆహార, ఎరువుల సబ్సిడీలను వరుసగా రూ.2.60 లక్షల కోట్లు, రూ.90,000 కోట్లుగా ఉంచాలని భావిస్తున్నారు. ఇది ఆర్థిక సంవత్సరం 2022 కోసం సవరించిన అంచనాల కంటే తక్కువ. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం సబ్సిడీ బిల్లు దాదాపు రూ. 5.35 నుండి 5.45 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివేదిక ప్రకారం, 2023 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో 6.5 శాతంగా ఉంటుందని ఒక అధికారి తెలిపారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన జిడిపిలో 6.8 శాతానికి ఇది భిన్నం. మన ఆర్థిక లక్ష్యాల మేరకు ఆహారం, ఎరువులపై సబ్సిడీ ఉంటుందని ఓ అధికారి తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆహార సబ్సిడీ బిల్లు సవరించిన అంచనాలలో సుమారు రూ. 3.90 లక్షల కోట్లు ఉంటుందని అంచనా వేయడం జరిగింది. బడ్జెట్‌లో చేసిన రూ. 2.43 లక్షల కోట్లు. కానీ 2021 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 4.22 లక్షల కోట్ల కంటే తక్కువ. కాగా, ఆర్థిక సంవత్సరం 2022లో ఆహార సబ్సిడీ బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే ఎక్కువగా ఉంటుంది. కరోనా మహమ్మారి కారణంగా మార్చి 2022 వరకు ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగిస్తోంది కేంద్రం. 2022 ఆర్థిక సంవత్సరానికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన మొత్తం వ్యయం రూ. 1.47 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ప్రభుత్వం బడ్జెట్‌లో 2022 ఆర్థిక సంవత్సరానికి ఎరువుల సబ్సిడీకి రూ.79,530 కోట్లు కేటాయించింది.అయితే, పెరుగుతున్న ఎరువుల ధరలు, సరఫరా పరిమితుల కారణంగా ప్రభుత్వం అదనపు నిధులను రెట్టింపు చేయవలసి ఉంటుంది. ఇది దాదాపు రెట్టింపు సబ్సిడీ బిల్లు రూ.1.41 లక్షల కోట్లకు చేరుకుంటుంది. నివేదిక ప్రకారం, 2023 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల కంటే ఎరువుల సబ్సిడీకి కేటాయింపు తక్కువగా ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనలో ఈ ఏడాది మొత్తం రూ.1.47 లక్షల కోట్ల వ్యయం కాగా, ఇప్పటికే రూ.90,000 కోట్లు ఖర్చు చేసినట్లు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ తెలిపారు. అంటే ఆహార సబ్సిడీకి అదనపు కేటాయింపు రూ.60,000 కోట్లు.ఇదిలావుంటే, దేశవ్యాప్తంగా కరోనావైరస్ విజృంభిస్తోంది. కొత్త వేరియంట్ ఒమిక్రాన్ కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎలా జరుగుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. కరోనా దృష్ట్యా ఈసారి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 11 వరకు తొలి విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి.మార్చి 14 నుంచి ఏప్రిల్ 8 వరకు రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల కమిటీ నిర్ణయం తీసుకుంది. మొదటి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా జనవరి 31న ఉదయం 11 గంటలకు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారుపెరుగుతున్న వ్యవసాయ బడ్జెట్ ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ వచ్చేనెల అంటే ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి సిద్ధం అయిపోతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రంగాల నుంచి డిమాండ్లు.. సూచనలు.. కోరికలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ అంటే పన్నుల గురించి ఎక్కువ మంది ఆలోచిస్తారు. ఆ తరువాత అందరి దృష్టి ఉండేది వ్యవసాయ రంగంపైనే. ఎందుకంటే, మన దేశంలో ఎక్కువ మంది ఆధారపడేది.. ఎక్కువ ఇబ్బందులు పడేదీ వ్యవసాయ రంగమేమంత్రిత్వ శాఖకు 2021-22లో రూ. 1,31,531 కోట్లు కేటాయించారు. 2019-20 కంటే 14% వార్షిక పెరుగుదల ఈ కేటాయింపుల్లో కనిపించింది. ఠిమంత్రిత్వ శాఖకు కేటాయింపులు ప్రభుత్వ బడ్జెట్‌లో 4%గా ఉంది. 2020-21లో రూ. 1,42,762 కోట్ల వ్యయం అవుతుందని మంత్రిత్వ శాఖ అంచనా వేసింది, ఇది సవరించిన దశలో 13% తగ్గి రూ. 1,24,520 కోట్లకు చేరుకుంది. ప్రాథమికంగా అంచనా వేసిన దాని కంటే తక్కువ లబ్ధిదారుల కవరేజీ కారణంగా పథకం (రైతులకు ఆదాయ మద్దతు పథకం)పై ప్రతిపాదిత వ్యయంలో రూ. 10,000 కోట్ల కోత కూడా ఆ సంవత్సరంలో ఉంది. 2020-21 అలాగే 2021-22లో, పీఎం కిసాన్ ఖర్చు రూ. 65,000 కోట్లుగా ఉంది.2021-22లో మంత్రిత్వ శాఖకు 49% కేటాయింపులు పీఎం కిసాన్ స్కీమ్ కోసం ఇచ్చారు. వడ్డీ రాయితీ, పంట బీమాతో సహా మంత్రిత్వ శాఖ అన్ని ఇతర కార్యక్రమాలకు 2021-22లో రూ. 66,531 కోట్లు కేటాయించడం జరిగింది

## యూపీ విధానమే ఫాలో అవుతున్నాం

విజయవాడ, జనవరి 20, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల కొత్త వేతన సవరణపై ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆరోపణలపై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ స్పందించారు. ఏ ఒక్క ఉద్యోగి గ్రాస్ శాలరీ ప్రభుత్వం తగ్గించ లేదని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల నుండి పీఆర్సీ గురించి అవగాహన ఉందన్నారు. అప్పటి పరిస్థితి వేరు.. ప్రస్తుత పరిస్థితులు వేరని ఆయన అన్నారు. కరోనా, ఒమిక్రాన్ మహమ్మారి కారణంగా రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయిందని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యలు, ప్రజలకిచ్చే సంక్షేమ పథకాలను సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని అంశాలపై చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పీఆర్సీ ఆలస్యం అవుతుందని రూ.17వేల కోట్లు మధ్యంతర భృతి ఇచ్చామన్నారు. ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా ఇదే తరహాలోనే హెచ్‌ఆర్ఏ ఇస్తున్నాయని సీఎస్ వెల్లడించారు. పీర్సీసీపై ఉద్యోగ సంఘాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మూడు పీఆర్సీ జీవోలపై ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఈ జీవోలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాయి. దీంతో ఏపీ సీఎస్ సమీర్ శర్మ వివరణ ఇచ్చారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ బుధవారం నాడు మీడియాతో మాట్లాడారు. కరోనా కారణంగా రాష్ట్రానికి ఆదాయం తగ్గిందని ఆయన చెప్పారు. గతంలో రాష్ట్ర ఆదాయం 98 వేల కోట్లుగా ఉండేదని, అదీ కరోనా కారణంగా 62 వేల కోట్లు పడిపోయిందన్నారు. ఆదాయాన్ని, ఖర్చులను బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుందన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ఐఆర్ ఇచ్చామన్నారు. కరోనా థర్డ్ వేవ్ వల్ల మరింత నష్టం జరిగే అవకాశం ఉందని సీఎస్ సమీర్ శర్మ అభిప్రాయపడ్డారు. ఐఆర్ కంటే జీతంలో భాగం కాదన్నారు. పీఆర్సీ వల్ల గ్రాస్ శాలరీలో ఏ మాత్రం తగ్గదని సీఎస్ స్పష్టం చేశారు. హెచ్‌ఆర్ తగ్గిందా? ;పెరిగిందా అనేది వేరే అంశమన్నారు. జీతాల్లో కోత మాత్రం పడే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేశారు. ఐఏఎస్‌లకు ఎక్కువ జీతాలు వస్తున్నాయనడం అవాస్తవమన్న సీఎస్.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఆర్సీని ఫాలో అవుతున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా జీతాలనుపెంచుతున్నామన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. పీఆర్సీలో ప్రతి అంశం సీఎం వైఎస్ జగన్‌కు తెలుసునని సీఎస్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభా ఎక్కువని కానీ పన్నుల నుండి వచ్చే ఆదాయం తక్కువ అని సీఎస్ చెప్పారు. ఐఆర్ తో రాష్ట్ర ఖజానాపై రూ. 17 వేల కోట్ల భారం పడిందని సీఎస్ చెప్పారు. పెన్షన్, గ్రాట్యుటీలో కూడా పెరుగుదల ఉంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.54,370 కోట్లుగా ఉంది. దేశంలో ఏ రాష్ట్రమూ ఉద్యోగ విరమణ వయస్సును పెంచలేదు. నియామకాలు ఉండవన్న ఆరోపణలు సరికావు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.5 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అలాగే వైద్యారోగ్య శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చాం" అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ తెలిపారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రితో ఉద్యోగ

సంఘాల నేతలు ఈ నెల 7వ తేదీన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో 23.29 శాతం పీఆర్సీ ఫిట్‌మెంట్ ఇస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా పెండింగ్ లోని ఐదు ఆ.ం లను ఒకే సారి ఇస్తామని హామీ ఇచ్చారు. ఫిట్‌మెంట్ కనీసం 27 శాతానికి తగ్గకుండా ఉండాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే పెండింగ్ డిఏలు ఒకేసారి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగ సంఘాలు సానుకూలంగా స్పందించాయిఈ భేటీ తర్వాత హెచ్‌ఆర్ఏ విషయమై సీఎస్ నేతృత్వంలోని కమిటీతో ఉద్యోగ సంఘాలు సంక్రాంతి పర్వదినం కంటే ముందే పలు దఫాలు భేటీ అయ్యారు. కానీ ఈ సమావేశాల్లో ఉద్యోగ సంఘాల డిమాండ్ పై ప్రభుత్వం నుండి స్పష్టత రాలేదు. అయితే, ఈ నెల 17వ తేదీ రాత్రి పీఆర్సీపై ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఈ జీవోల్లో హెచ్‌ఆర్ఏను భారీగా తగ్గించడంపై ఉద్యోగ సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. 30 శాతంగా ఉన్న హెచ్‌ఆర్ఏ స్థానంలో 16 శాతం హెచ్‌ఆర్ఏ ఇవ్వడంతో తాము 14 శాతం నష్టపోతున్నామని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

## బావల కోసం బాలయ్య...

విజయవాడ, జనవరి 20, (న్యూస్ పల్స్) ఉప్పు..నిప్పులా ఉండే ఆ రెండు కుటుంబాల మధ్య రెండున్నర దశాబ్దాలుగా సఖ్యత లేదు. పేరుకు తోడల్లుళు అయినా.. ఎవరి రాజకీయం వారిదే. కుటుంబ కార్యక్రమాల్లోనూ పెద్దగా కలిసింది లేదు. ఇటీవలే ఆ ఇద్దరు ఓ కార్యక్రమంలో కలుసుకుని.. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఈ అంశంపై చర్చ జరుగుతుండగానే.. సంక్రాంతి పండక్కి చాలాఏళ్ల తర్వాత ఓ అక్క ఇంటికి తమ్ముడొచ్చాడు. ఆ తమ్ముడి సందడి సంక్రాంతికే పరిమితమా.. లేక ఇద్దరు బావలను కలపటం కోసమా? ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నే హాట్ టాపిక్.దగ్గుబాటి వెంకటేశ్వరరావు. మామ ఎన్టీఆర్‌తో కలిసి రాజకీయంగా అడుగులు వేశారు. మాజీ సీఎం చంద్రబాబు కంటే టీడీపీలో సీనియర్. ఉమ్మడి ఏపీలో దగ్గుబాటి అండతోనే టీడీపీలో రాజకీయంగా పైకి ఎదిగిన నేతలు ఎందరో. ఎన్టీఆర్ నిష్క్రమణ తర్వాత కాంగ్రెస్‌లో చేరి.. 2004, 2009లో ప్రకాశం జిల్లా పర్చూరు ఎమ్మెల్యేగా గెలిచారు. మొత్తం ఐదుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి లోక్‌సభ, మరోసారి రాజ్య సభ సభ్యునిగా పనిచేశారు. మారిన పరిణామాలతో 2019లో వైసీపీలో చేరి పర్చూరులో పోటీచేసి తొలిసారి ఓడిపోయారు. కొన్ని రోజులు వైసీపీలో యాక్టివ్‌గానే ఉన్నా తర్వాత వైసీపీకి దూరంగా ఉన్నారు. భర్త అడుగుజాడల్లో రాజకీయాల్లోకి వచ్చిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు భార్య పురందేశ్వరి 2004లో బాపట్ల, 2009లో విశాఖ నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు పురందేశ్వరి. ప్రస్తుతం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి. 2019లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు వైసీపీలో చేరే సమయానికి పురందేశ్వరి బీజేపీలో ఉండటం.. తరచూ ఆమె వైసీపీని విమర్శించడం కొంత వివాదానికి దారితీసింది. చివరకు ఇద్దరూ చేరో పార్టీలో ఉంటూ ఒకరు పార్టీని విమర్శించటం సరికాదని వైసీపీ పెద్దలు చెప్పారట. దాంతో పురందేశ్వరిని యాక్టివ్ పాలిటిక్స్‌లో కొనసాగించాలని భావించి.. ఆయన పాలిటిక్స్‌కు దూరంగా ఉండిపోయారు. బాలకృష్ణకు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరిలు స్వయానా అక్కాబావలు. తన తోబుట్టువులతో అత్యంత సన్నిహితంగా ఉండే బాలకృష్ణ.. 2009 ఎన్నికల సమయంలో టీడీపీ తరఫున కారంచేడులో ఎన్నికల ప్రచారానికి వచ్చారు. అప్పటి పర్చూరు టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి నరసయ్య తరఫున ప్రచారం చేస్తూ ఫ్లో లో నోరు జారారు. తనకు ఎవరైనా ఒకటే అని అక్క ఇంటి ముందే తొడకొట్టారు. అప్పట్లో బాలయ్య తీరు రచ్చ రచ్చ అయింది. ఎంత రాజకీయాల్లో ఉన్నా కుటుంబానికి విలువ ఇచ్చే బాలకృష్ణ.. సొంత అక్క ఇంటి ముందు తొడకొట్టడం సరైంది కాదనే వాదన వినిపించింది. సీన్ కట్‌చేస్తే బాలకృష్ణ కుటుంబ సమేతంగా ఈ సంక్రాంతికి అక్క పురందేశ్వరి ఇంటికి వచ్చారు.పండగ మూడు రోజులూ అక్క ఇంటి దగ్గరే ఉన్నారు బాలయ్య. ఓ రోజు గుర్రమెక్కారు. మరో రోజు ఎద్దుల బండిని నడిపారు. సముద్ర తీరంలో టాప్ లెస్ జీపులో హుషారుగా తిరిగారు. ఎప్పుడు పురందేశ్వరి ఇంటికి వచ్చినా.. వచ్చామా.. వెళ్లామా అన్నట్టుగా సాగే బాలకృష్ణ కార్యక్రమం ఈసారి ఆద్యంతం అందిరికీ తెలిసేలా సాగింది. ఎన్నడు లేని విధంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్వయంగా బాలయ్య సందడిని వీడియో తీస్తూ కనిపించారు. ఆయనే స్వయంగా పలువురికి ఆ వీడియోలను పంపించారట. కరోనా వల్ల ఎవరినీ ఇంట్లోకి అనుమతించకపోవడంతోనే వీడియోలు విడుదల చేశామని చెబుతున్నప్పటికీ అందులో ఏమైనా ఆంతర్యం ఉందా విశ్లేషకులు ఆరా తీస్తున్నారట. ఏ కార్యక్రమం చేసినా.. రాజకీయ నిర్ణయం తీసుకున్నా గోప్యంగా ఉండే దగ్గుబాటి వెంకటేశ్వరరావు.. పండక్కి వచ్చిన బాలకృష్ణ పర్యటన మొత్తం అందరికీ తెలిసేలా చేయటం వెనక కథేంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.టీడీపీలో మొదటి నుంచీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చంద్రబాబు దారులు వేరు. రెండు గ్రూపుల్లో ఉండేవారు. ఎన్టీఆర్ మరణానంతరం విభేదాలతో దగ్గుబాటి.. ఆయన తోడల్లుడు చంద్రబాబు చెరోదారి అయ్యారు. రాజకీయంగా కూడా మరింత ప్రత్యర్థులుగా మారారు. అప్పటి నుండి కుటుంబ కార్యక్రమాల్లో కూడా ఇద్దరూ కలిసిన దాఖలాలు లేవు. అలాంటిది చంద్రబాబు, దగ్గుబాటి ఇటీవల ఓ కుటుంబ కార్యక్రమంలో కలిశారు. ఇద్దరు ఓచోట చేరి.. కాసేపు మాట్లాడుకున్నారు. కలసి ఫొటోలకు ఫోజులిచ్చారు. అప్పటి నుండి ఇద్దరూ కలిసి పోతారనే టాక్ ప్రారంభమైంది. దీనికి ఊతమిచ్చేలా బాలకృష్ణ అన్నీ కార్యక్రమాలను మార్చుకుని కారంచేడులో అక్క పురందేశ్వరి ఇంట్లోనే మకాం వేయటంతో రకరకాలుగా చర్చించుకుంటున్నారు. టీడీపీ క్రియాశీలకంగా మారి.. అంతా కలిస్తేనే ప్రత్యర్థిపై గెలుపు సొంతం అవుతుందన్న చర్చ జరుగుతోంది. అందుకే నందమూరి కుటుంబం మధ్య లుకలుకలు లేకుంటేనే పార్టీ నిలబడుతుందని బాలకృష్ణ నడుం బిగించి ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. పైగా చంద్రబాబు భార్య భువనేశ్వరి గురించి జరిగిన రగడంలో పురందేశ్వరి సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. అదే అక్క ఇంటికి బాలయ్య రావడం.. తీరిక చేసుకుని నాలుగు రోజులు ఉండటం వెనక ఆంతర్యం ఏంటన్నది విశ్లేషకుల ప్రశ్న.దగ్గుబాటిని తిరిగి టీడీపీలోకి తీసుకొచ్చే చర్చలు మొదలయ్యాయా? అనే సందేహాలు ఉన్నాయట. టీడీపీ సంక్షోభ సమయంలో దగ్గుబాటికి పార్టీ అధ్యక్ష పగ్గాలు అప్పగించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉంటారన్న ప్రచారం సాగింది. కానీ, ఆ రెండు భాద్యతలను చంద్రబాబే తీసుకున్నారు. అది కూడా రెండు కుటుంబాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితికి తీసుకొచ్చిందని చెబుతారు. బాలకృష్ణ టీడీపీలో చురుకుగా ఉండటం కూడా వారి మధ్య సంబంధాలు అంతంతమాత్రంగానే ఉంటూ వచ్చాయి. ఇప్పుడు కారంచేడుకు బాలయ్య వస్తే.. బామ్మర్ది వెళ్లేవరకు బావ దగ్గుబాటి వెంటే ఉన్నారు. నందమూరి కుటుంబంలోని మరికొందరు ముఖ్యులు కూడా వచ్చారు. దీంతో బాలయ్య సంక్రాంతి కోసమే కారంచేడు వచ్చారా.. లేక దగ్గుబాటిని టీడీపీలోకి తీసుకెళ్లే ప్రయత్నమా? నందమూరి.. దగ్గుబాటి కుటుంబాలతో నారా కుటుంబం కూడా కలసిపోయి.. అందరూ ఒకే గూటికి వస్తారా అన్న చర్చ మొదలైంది. మరి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆలోచనలు ఏంటో? చంద్రబాబుతో కలిసి అడుగులు వేస్తారో లేదో చూడాలి

## జై గుడివాడ... ఇదేంటీ...పరువు తీసేశారు...

విజయవాడ, జనవరి 20, (న్యూస్ పల్స్)గుడివాడ.. ఇదో బ్రాండ్ నేమ్.. మహామహులకు పుట్టినిల్లు.. చైతన్య సాహితీ వికాసాల ఘనకీర్తి.. జాతిపిత పూజ్య బాపూజీ నడయాడిన నేల.. సినీ వినీలాకాశంలో ధ్రువతారలు ఎన్టీఆర్, ఏఎన్నార్, ఘంటసాల పురిటిగడ్డ గుడివాడ. నక్సలైట్ ఉద్యమ నేత కొండపల్లి సీతారామయ్యదీ ఇదే నేల. దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి హోమియో కళాశాల నెలకొల్పిందీ ఇదే గుడివాడలోనే. వ్యవసాయ సంబంధ పరికరాల తయారీకి మారుపేరు కూడా ఈ గుడివాడదే.. అంతటి ఘన చరిత్ర ఉన్న గుడివాడ ప్రాభవం ఇప్పుడు మసకబారిపోతోందని స్థానికుల్లో ఆవేదన పెరిగిపోతోంది. గాంధీ నడయాడిన గడ్డ ఇప్పుడు జూదాలు, పేకాటలు, క్యాసినోలు, బూతులకు చిరునామాగా మారిపోయి, అపకీర్తిని మూట గట్టుకుంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కృష్ణా జిల్లాలోని ప్రధాన నగరాల్లో ఒకటైన గుడివాడ.. రాజకీయ, సినీ రంగాలకు ఎందరో మహామహులను అందించిన గడ్డ. వారంతా గుడివాడకు ప్రపంచ స్థాయిలో ఘన కీర్తి తెచ్చిపెట్టారు. ఇప్పుడదే గుడివాడను 'బూతుల నేత ఊరేనా?.. పేకాటలు, గోవా తరహా క్యాసినోలు నడిచిందక్కడే కదా' అని గుర్తు చేసుకోవాల్సిన దుస్థితికి తెచ్చారు గుడివాడ నేతలు అంటూ స్థానికులు నోళు నొక్కుకుంటున్నారు.ఒకప్పుడు గుడివాడ.. 'విదర్భపురి' పేరుతో భాసిల్లింది. అనేక గుడులు ఉన్న ఈ నేల గుడులవాడగా ప్రసిద్ధి చెందింది. కాలక్రమేణా అది గుడివాడగా మారింది. వర్తక, వాణిజ్యాలు, విద్య, వైద్య, రాజకీయ రంగాల ప్రముఖులతో విలసిల్లింది గుడివాడ. వాస్తవానికి కృష్ణా జిల్లా రాజకీయం మొత్తం గుడివాడ చుట్టూనే తిరిగేదంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జాతిపిత మహాత్మా గాంధీని మూడుసార్లు ఆకర్షించింది గుడివాడ గడ్డ. ఇక్కడి ప్రజల స్వాతంత్ర్యోద్యమ చైతన్యాన్ని చూసి ముగ్ధుడైన గాంధీజీ 1921, 1923, 1933 సంవత్సరాల్లో గుడివాడ వచ్చారు. గాంధీ స్ఫూర్తితో గుడివాడ వాసి గూడూరి రామచంద్రుడు హరిజనాశ్రమం నిర్మించారు. ఈ విషయం గాంధీజీయే స్వయంగా 1921లో 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రత్యేకంగా ప్రస్తావించడం గుడివాడ విశేషం.తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, నటరత్న ఎన్టీ రామారావు పుట్టింది గుడివాడ నియోజకవర్గంలోని నిమ్మకూరులో. 1983లో తన రాజకీయ ఆరంగేట్రం చేసింది కూడా గుడివాడ శాసనసభా స్థానం నుంచే. 1985లో ఎన్టీఆర్ గుడివాడ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ తన హయాంలో గుడివాడ నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుదీ గుడివాడ ప్రాంతం నందివాడ మండలం వెంకట రాఘవాపురంలో పుట్టారు. గుడివాడలో ఆయన సమకూర్చిన నిధులతో ఏఎన్నార్ పేరుతో ఓ డిగ్రీ కళాశాల నడుస్తోంది. ఇక అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఇదే నియోజవర్గం చౌటపల్లిలో జన్మించారు. ప్రముఖ సినీ నటుడు కైకాల సత్యనారాయణ కూడా ఈ ప్రాంతం నుంచి వెండితెరకు పరిచయం అయ్యారు.తొలి తరం మావోయిస్టు ఉద్యమ నేత కొండపల్లి సీతారామయ్య, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి, సినీ ఫొటోగ్రాఫర్ వీఎస్సార్ స్వామి, సినీ గేయాలకు సాహిత్యశోభ అద్దిన మల్లాది, విద్యుత్ రంగ నిపుణుడు నార్ల తాతారావు, ప్రసిద్ధ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు గుడివాడ నియోజకవర్గంలో జన్మించినవారే. బౌద్ధ వాంగ్మయ బ్రహ్మ దుగ్గిరాల బలరామకృష్ణయ్య, ప్రసిద్ధ సినీ దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం, కె.ప్రత్యగాత్మ, దుక్కిపాటి మధుసూదన్ రావు, ప్రముఖ చిత్రకారుడు ఎస్వీ రామారావు, సాహితీవేత్త త్రిపురనేని హనుమాన్ చౌదరి కూడా గుడివాడ వారే.ఇంతటి ఘన చరిత్ర ఉన్న గుడివాడ కీర్తి ఇప్పుడు మసకబారిపోతోందే అనే ఆవేదన స్థానికుల్లో ఎక్కువైపోతోంది.జూదగృహాలు, క్యాసినోలు, భూ కబ్జాలు, గడ్డం గ్యాంగులు గుడివాడ ఘన చరిత్రను దిగజారుస్తున్నాయని ప్రతి ఒక్కరిలో అసంతృప్తి రగిలిపోతోంది. సరదాల సంక్రాంతి పండుగ నెపంతో విదేశీ క్యాసినో సంస్కృతిని దిగుమతి చేసుకున్న నగరం అని ఇప్పుడు జనం నోళ్లలో నానిపోతోంది

## పెద్దారెడ్డికి రాజకీయంగా ఇబ్బందులు


అనంతపురం, జనవరి 20, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఒక నియోజకవర్గం మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పోలింగ్ దగ్గర నుంచి కౌంటింగ్ వరకూ ఆ నియోజకవర్గాన్ని రెండు రాష్ట్రాల్లో తెలుగు ప్రజలు ఆసక్తితో అనుసరిస్తుంటారు. అదే తాడిపత్రి నియోజకవర్గం. తాడిపత్రి నియోజకవర్గం ఎప్పుడూ హాట్ టాపిక్. ఇక్కడ జేసీ ఫ్యామిలీకి పట్టుంది. దశాబ్దాలుగా జేసీ కుటుంబమే తాడిపత్రిని శాసిస్తుంది. అటువంటి తాడిపత్రిని గత ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. వైసీపీలోనే జెయింట్ కిల్లర్ గా నిలిచారు. పెద్దారెడ్డి గెలవడంతో వైసీపీకి 151 సీట్లు రావడంలో ఆశ్చర్యమేమీ లేదన్నది అప్పట్లో ఆ పార్టీ నుంచే విన్పించిన టాక్. అలాంటి పెద్దారెడ్డి ఇప్పుడు రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాడిపత్రి నియోజవకర్గంలో పెద్దారెడ్డి పై వ్యతిరేకత క్రమంగా పెరుగుతూ వస్తుందని చెబుతున్నారు. అసంతృప్తి పెరిగిందా? దీనికి కారణం ఆయన వ్యక్తిగత వైఖరి కొంత అయితే నియోజకవర్గంలో అభివృద్ధి లేకపోవడం మరికొంత. పెద్దారెడ్డి పై అసంతృప్తి ఉందని ఇటీవల జరిగిన స్థానికసంస్థల ఎన్నికల ఫలితాలే రుజువు చేశాయి. తాడిపత్రి మున్సిపాలిటీతో పాటు ఎంపీటీసీ స్థానాలను కూడా ప్రత్యర్థి వర్గం చేజిక్కించుకుంది. క్రమంగా జేసీ కుటుంబం పట్టు పెరుగుతోంది. అయితే పెద్దారెడ్డి ఇప్పటికిప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టినా ఫలితం లేదంటున్నారు.పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపైకి దాడికి వెళ్లడం, ఆయనపై అక్రమ కేసులు బనాయించడం వంటివి జేసీ ఫ్యామిలీకి కలసి వస్తాయని చెబుతున్నారు. 1985 నుంచి 2014 వరకూ వరసగా గెలుస్తూ వస్తున్న జేసీ కుటుంబం మొన్న ఓటమి పాలయినా తిరిగి నిలదొక్కుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతన్నాయి. పెద్దారెడ్డి పై వ్యతిరేకత కన్నా జేసీ కుటుంబంపై సానుభూతి వారికి ప్లస్ గా మారనుందని చెబుతున్నారు. మరి రెండేళ్లలో పెద్దారెడ్డి పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకుంటారా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

## గంధం చెక్కల మాయంలో ఇంటిదొంగలు

అనంతపురం, జనవరి 20, (న్యూస్ పల్స్)నంతపురం జిల్లా పెనుగొండ అటవీకార్యాలయంలో దొంగలు పడ్డారు. ఒకటికాదు, రెండు కాదు ఏకంగా 70 లక్షల విలువైన శ్రీగంధం చెక్కలు, గంధం నూనె డబ్బాను మాయం చేశారు. శ్రీగంధం చెక్కల మాయంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఘటనపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నలుగురు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేరని సామెత. కానీ అనంతపురం జిల్లా పెనుగొండ అటవీకార్యాలయంలో శ్రీగంధం చెక్కల దొంగతనం ఇంటిదొంగల పనేనని ప్రాథమికంగా నిర్ధారించారు ఉన్నతాధికారులు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నలుగురు బీట్ ఆఫీసర్లను సస్పెండ్ చేశారు. పెనుగొండ అటవీశాఖ కార్యాలయంలో శ్రీగంధం చెక్కలు, 16లీటర్ల గంధం నూనె డబ్బాను అపహరించారు ఇంటి దొంగలు. దొంగతనానికి గురైన శ్రీగంధం చెక్కలు, గంధం నూనె డబ్బా విలువ 70 లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇంత భారీ మొత్తంలో గంధం చెక్కలు మాయమవడంపై అటవీశాఖ ఉన్నతాధికారుల ఫిర్యాదుతో డీఎస్పీ రమ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీం విచారణ జరుపుతోంది. ఇంటి దొంగల పాత్రపై ప్రాథమిక ఆధారాలున్నట్లు తెలుస్తోంది. అదే నిజమైతే ఆ అధికారులను శాశ్వతంగా విధుల్లోంచి తొలగించడమే కాకుండా జైలుకు పంపుతామని తెగేసి చెబుతున్నారు అటవీ శాఖ ఉన్నతాధికారులుఇంత భారీ మొత్తంలో సరుకును అటవీ అధికారులకు తెలియకుండా తరలించడం ఎలా సాధ్యమన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. గంధం చెక్కలు ఎక్కడికి తరలించారు? ఎక్కడ దాచి ఉంటారన్న కోణంలో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీగంధం చెక్కలను ఇప్పటికే కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలకు తరలించి ఉంటారని అనుమానిస్తున్నారు పోలీసులు. అదే కోణంలో పలు బృందాలుగా విడిపోయి గంధపు చెక్కల కోసం ఆయా రాష్ట్రాల్లో గాలింపును ముమ్మరం చేశారు పోలీసులు

## శ్రీశైలంలో కరోనాకలకలం

శ్రీశైలం శ్రీశైల మండలంలో కరోనా కేసులు మళ్లీ విజృంభిస్తున్నాయి. మండలంలో మొత్తం 38 కరోనాన పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. బుధవారం రాత్రి శ్రీశైలంలోని అమ్మవారి ఆలయంలో ఒక అర్చకుడికి కరోన పాజిటీవ్ నిర్ధారణ అయినట్లు



స్థానిక ప్రాథమిక వైద్యశాల వైద్యుడు తెలిపాడు మండలంలోని మొత్తం కరోన పాజటీవ్ కేసులలో శ్రీశైలం 29, సుండిపెంట 9 పాజిటివ్ కేసులుగా నమోదయ్యాయి. ఇది ఇలా ఉంటే ఇప్పటికే దేవస్థానం క్షేత్రపరిధిలో కరోన ఆంక్షలను కట్టుదిట్టం చేసినప్పటికీ కరోన కేసులు పెరగడంపై ఉద్యోగస్తులలో, స్థానికులలో, వ్యారస్తులలో భయాందోళన మొదలైంది క్షేత్ర పరిధిలో ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా ధరించాలని, తరచూ స్వీయ రక్షణతో మెలగాలని, భౌతికదూరం పాటించాలని దేవస్థానం ఈవో లవన్న పాథమిక వైద్యశాల వైద్యుడు సోమశేఖర్ సూచించారు.

# మూడు ఖాళీలు- 30 మంది పోటీ

విజయవాడ, జనవరి 20, (న్యూస్ పల్స్)వచ్చే రెండు నెలల్లోనే రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఏపీకి చెందిన నాలుగు రాజ్యసభ స్థానాలు జూన్ లో ఖాళీ అవుతున్నప్పటికి మార్చి నెలలో దీనికి సంబంధించి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. నాలుగు రాజ్యసభ స్థానాలు వైసీపీకే దక్కుతాయి. ఖాళీ అయ్యే స్థానాల్లో ఒకటే వైసీపీది. మిగిలిన మూడు బీజేపీవే. బీజేపీవి అంటే బీజేపీవి కాదులెండి. ఒరిజనల్ గా తెలుగుదేశం పార్టీకి చెందినవే.వచ్చే జూన్ నాటికి ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలు నాలుగు. విజయసాయిరెడ్డి, సుజనా చౌదరి, సురేష్ ప్రభు, టీజీ వెంకటేష్. వీరిలో విజయసాయిరెడ్డి పదవీ కాలం మరోసారి జగన్ రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. అంటే ఆయనకు రెన్యువల్ చేయడంతో రెడ్డి సామాజికవర్గానికి భర్తీ చేసినట్లే. ఇక మూడు స్థానాలు ఎవరికి అన్న చర్చ ఇప్పటి నుంచే పార్టీలో మొదలయింది. ఒకటి ఖచ్చితంగా బీసీలకు ఇవ్వాలని జగన్ భావిస్తున్నారట.మరొకటి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించాలన్నది జగన్ అభిప్రాయంగా ఉంది. ఎన్నికలకు ఇంకా రెండేళ్లే సమయం ఉండటంతో పక్కా సామాజిక సమీకరణాలు పాటించాలని పార్టీ అధినేత ఆలోచన. అందుకే ఇప్పటి నుంచే తమకు దక్కనున్న నాలుగు రాజ్యసభ పదవులపై జగన్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ జగన్ అభిప్రాయాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. జగన్ 2019 ఎన్నికలకు ముందు కొందరికి రాజ్యసభ పదవి హామీ ఇచ్చారు. వారందరూ ఇప్పుడు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.బీసీలు, ఎస్సీ, మైనారిటీలకు ఎమ్మెల్సీ పదవుల్లో జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. వారికే యాభై శాతం ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించారు. రాజ్యసభలో పార్టీకి అన్ని రకాలుగా ఉపయోగపడేవారికి ప్రయారిటీ ఇవ్వాలని కొందరు సీనియర్ నేతలు కోరుతున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి కిల్లి కృపారాణికి ఈసారి రాజ్యసభ పదవి ఇస్తారంటున్నారు. అదే సమయంలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేకపోయిన మర్రి రాజశేఖర్ కు కూడా ఈ పదవి దక్కే అవకాశం ఉందంటున్నారు. ముద్రగడ పద్మనాభం అంగీకరిస్తే ఆయనకు కూడా ఒక పదవి ఇచ్చేందుకు జగన్ సిద్ధంగా ఉన్నారని చెబుతున్నారు. నలుగురిలో ఒకటి విజయసాయిరెడ్డికి ఖాయం కాగా, మిగిలిన ఆ ముగ్గురు ఎవరు? అన్న చర్చ జరుగుతోంది.

# ఇక టీడీపీలో జోష్...

## వారానికి ఓ నేత జాయినింగ్

విజయవాడ, జనవరి 20, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పార్టీని గాడిలో పెట్టడానికి అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో జోష్ రావాలంటే ఏదో ఒకటి చేయాలి. తన సందేశాలు, స్పీచ్ లతో నేతల్లో మార్పు రాదు. క్యాడర్ లో జోష్ పెరిగితేనే నేతలు కూడా పరుగులు పెడతారు. అలాంటి వాతావరణం రావాలంటే పార్టీలో చేరికలు జరగాలి. చంద్రబాబు తొలి నుంచి అనుసరించే విధానం ఇదే. పార్టీ కాని, అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం కాని ఇబ్బంది పడుతున్నప్పుడు ఆయన చేరికలనే ఆశ్రయిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు చేరికల కోసం పెద్దగా ప్రయాస పడాల్సిన పనిలేదు. ఆఫర్లు చెబితే వారంతట వారే చేరతారు. కానీ అధికారంలో లేనప్పుడే కష్టం. ఆఫర్లు ప్రకటించేందుకు ఆయన వద్ద శూన్య హస్తాలే ఉన్నాయి. ఒక్క ప్యాకేజీ తప్ప ఆయనేమీ వచ్చే వారికి ఇవ్వలేని పరిస్థితి. పదవులు ఈ మూడేళ్లలో ఒక్కటి కూడా దక్కేపరిస్థితి లేదు. పదవులు దక్కే అవకాశం ఏ మాత్రం ఉన్నా చేరికలుండేవి. కానీ ఆ అవకాశమూ లేదు. కానీ చేరికలు ఉండాల్సిందే. అవి ఉంటేనే పార్టీలో కొంత ఊపు వస్తుంది. అందుకే వచ్చే నెల నుంచి చేరికలను షురూ చేయాలని చంద్రబాబు భావిస్తున్నారట. మొన్నటి వరకూ తాను వద్దనుకున్న నేతలను కూడా చేర్చుకునేందుకు చంద్రబాబు సిద్ధపడ్డారట. ప్రకాశం జిల్లాకు చెందిన పాలపర్తి డేవిడ్ రాజు వైసీపీకి రాజీనామా చేసి చాలా కాలం అయింది. ఆయన చేరికను తొలుత అభ్యంతరం చెప్పిన చంద్రబాబు ఇప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇక విశాఖకు చెందిన వాసుపల్లి గణేష్ కుమార్ టీడీపీని వీడి వైసీపీకి మద్దతుదారుగా మారిపోయారు. ఆయన ప్రస్తుతం వైసీపీలో ఇమడలేకపోతున్నారు. తిరిగి టీడీపీకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు కూడా చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలిసింది. వీరితో పాటు నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలో కొందరు నేతలు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వారానికి ఒక నేత చొప్పున చేర్చుకునేందుకు చంద్రబాబు క్యాలెండర్ రెడీ చేస్తున్నారు.

# పీఆర్సీపై కాకినాడ కలక్టరేట్ ముట్టడి

కాకినాడ జనవరి 20, (న్యూస్ పల్స్)ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అసంబద్ధ పీఆర్సీకి వ్యతిరేకంగా ఫ్యాప్టో ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలక్టరేట్ ముట్టడి కార్యక్రమం కొనసాగుతుంది.ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలువురు ఉద్యోగులు, పెద్దఎత్తున ఉపాధ్యాయులు, పెన్షనర్లు హాజరయ్యారు.సచివాలయం ఉద్యోగులు, సీఐటీయూ,ఏఐటీయూసీ తదితర ట్రేడ్ యూనియన్లు,ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.ఈ సందర్భంగా జరిగిన ధర్నాను ఉద్దేశించి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు.ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు శోచనీయమని మండిపడ్డారు. పిఆర్సి విషయంలో ఏపీ సర్కార్ చేస్తున్న అన్యాయంపై ఉద్యోగులంతా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రకటించిన పీఆర్సీ ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈనిరసనలకు ప్రభుత్వం దిగిరాకపోతే భవిష్యత్లో ఉద్యోగులందరూ సమ్మెకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నారని ఫ్యాప్టో నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కుమార్, జిల్లా ఫ్యాప్టో అధ్యక్ష,కార్యదర్శులు చెవ్వూరి రవి, సెక్రటరీ బొజ్జా శరత్, కో చైర్మన్లు ఎన్. జ్యోతిబసు, నాగిరెడ్డి శివప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, టి.వెంకట్రావు, ఎస్టీయూ కోశాధికారి పి.సుబ్బరాజూ, యూటీఫ్ రాష్ట్రబాధ్యులు ప్రభాకరవర్మ , యూటీఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మోర్త శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మేడిశెట్టి కూర్మారావు,పిఈటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లంక జార్జ్, ఏపీటీఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు ఫిలిప్ రాజు,సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరులో ఉపాధ్యాయుల అందోళన

చిత్తూరు జనవరి 20, (న్యూస్ పల్స్)ఛలో కలెక్టరేట్ కు పిలుపునిచ్చిన ఉపాధ్యాయులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నా అప్పటికీ వేల సంఖ్యలో ఉపాధ్యాయులు కలెక్టరేట్కు చేరుకున్నారు పిఆర్సి , సిపిఎస్ లాంటి డిమాండ్తో వారు కలెక్టరేట్కు ముట్టడికి పిలుపునివ్వడంతో ఈరోజు ఉదయం నుంచి చిత్తూరు చేరుకుంటున్న ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్లో ఉంచారు మరికొంతమందిని ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు అయినప్పటికీ ఉపాధ్యాయులు వేల సంఖ్యలో కలెక్టరేట్ చేరుకోవడం విశేషం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి పోలీసులు తమను అడ్డుకోవడానికి ప్రయత్నించారు ఉపాధ్యాయులు అంటున్నారు

# సోమిరెడ్డి..స్లో అయ్యారు



నెల్లూరు, జనవరి 20, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కీలక నేత. అందులో ఎటువంటి డౌట్ లేదు. ఆయన సీనియర్ నేత మాత్రమే కాకుండా రెడ్డి సామాజికవర్గం కూడా కావడంతో చంద్రబాబు ఆయనకు స్పెషల్ ప్రయారిటీ ఇస్తారు. వైసీపీపై మాటల దాడి చేయాలంటే టీడీపీ లో ఆ సామాజికవర్గం నుంచి సోమిరెడ్డి ఒక్కరే కనిపిస్తారు. కానీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇటీవల కాలంలో స్లో అయినట్లే కన్పిస్తుంది. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కి 2014లో అధికారంలోకి రాగానే చంద్రబాబు ఎమ్మెల్సీని చేసి మంత్రి పదవి ఇచ్చారు. గత ఐదు పర్యాయాలు వరసగా ఓటమిపాలవుతున్నా సోమిరెడ్డి పట్ల చంద్రబాబు సాఫ్ట్ కార్నర్ గానే ఉండేవారు. జిల్లా రాజకీయాల్లోనూ ఆయన మాటకు చంద్రబాబు విలువ ఇచ్చేవారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సోమిరెడ్డి ఏం చెబితే అది జరిగేదన్నది వాస్తవం. అధికారంలో లేకపోయినా ఆయన జిల్లాలో పార్టీని శాసిస్తారు. కానీ ఒక రెండు నెలల నుంచి చంద్రబాబు కూడా సోమిరెడ్డిని లైట్ గా తీసుకుంటున్నట్లు కనపడుతుంది. కార్పొరేషన్ దీనికి ప్రధాన కారణం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సోమిరెడ్డి దారుణంగా ఫెయిలయ్యారని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. నామ్ కే వాస్తేగా ఇద్దరు కిందిస్థాయి నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేసినా దీనికి ప్రధాన కారణం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసరెడ్డి కారణమని భావిస్తున్నారు. పార్టీ ఇంత చేసినా సోమిరెడ్డి సక్రమంగా కార్పొరేషన్ ఎన్నికలలో వ్యవహరించలేదని చంద్రబాబు ఆగ్రహంతో ఉన్నారని తెలిసింది. అందుకే ఇటీవల జరిగిన సమీక్షలోనూ కొన్ని చురకలు సోమిరెడ్డిపై పరోక్షంగా చంద్రబాబు వేశారంటున్నారు. సర్వేపల్లిలో కూడా ఈసారి కొత్త అభ్యర్థికి టిక్కెట్ ఇవ్వాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. సోమిరెడ్డికి పార్టీ అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీయో, రాజ్యసభ పదవో ఇస్తారు తప్పించి ఈసారి టిక్కెట్ ఇచ్చేది కూడా కష్టమేనని చెబుతున్నారు. నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డి ఆధిపత్యానికి తెరపడేలా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని పార్టీ టాక్. అందుకే ఇటీవల కాలంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్లో అయ్యారంటున్నారు.

# ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పర్యటన

## క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన

శేరిలింగంపల్లి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం, హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ నగర్ ఫేస్ 1 కాలనీ లో పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ లో పర్యటించినశేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా కాలనీ వాసులు కైదమ్మ కుంట చెరువు కట్ట కింద గల కల్వర్ట్ పనులు పూర్తి చేయాలని కోరుతూ, జనప్రియ ఫేస్ 1 కాలనీ లో రోడ్డు ను పునరుద్ధరణ చేసిన శుభసందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ కి కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆరెక పూడి గాంధీ మాట్లాడుతూ, కల్వర్ట్ సమస్యను త్వరలోనే పరిష్కరించి అతి త్వరలోనే కల్వర్ట్ ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకువస్తామని, శాశ్వత పరిష్కారం చూపుతాం అని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని , తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు .చెరువు అలుగు నుండి నిర్మించిన వరద నీటి కాల్వ నిర్మాణం పూర్తి చేస్తామని, కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ,సమస్యలను పరిగణలోకి తీసుకోని ,వారి విజ్ఞప్తి మేరకు కాలనీ లో పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కాలనీలలో క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు,అక్కడికి అక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు.అదేవిధంగా కాలనీలో నెలకొన్న వరద నీటి కాల్వ సమస్యను పరిష్కరిస్తానని, సమస్యలపై ప్రభుత్వ విప్ గాంధీ సానుకూలంగా స్పందించి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, డ్రైనేజీ, రోడ్లు, మంచి నీరు,విద్యుత్ దీపాలు వంటి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని, కాలనీ వాసులందరి సమిష్టి కృషి తో ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దుతామని, ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని , మెరుగైన జీవన ప్రమాణాలకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు అదేవిధంగా డివిజన్ లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీ హెచ్ ఎమ్ సీ ఏ ఈ ప్రతాప్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ప్రాజెక్ట్ సైట్ ఇంజనీర్ రజియా బేగం, జనప్రియ ఫేస్ 1 కాలనీ వాసులు శాంత య్య, మలికార్జున్, ఉమేష్ , ఉమామహేశ్వరరావు, రవి, రాంచందర్ ,సురేష్, ఫణి కుమార్,ప్రకాష్ పటేల్, శ్రీనివాస్ ,వాసుదేవ్ , రాం బాబు, ప్రభ ,లీల రాణి ,రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఐఆర్‌తో ప్రభుత్వంపై 18వేల కోట్ల భారం

## ఉద్యోగులకు మేలు చేయాలన్నదే జగన్ లక్ష్యం
## వారికి నష్టం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు: శ్రీకాంత్ రెడ్డి

విజయవాడ,జనవరి20: కరోనాతో ఆర్థిక పరిస్థితులు దిగజారినా.. ఉద్యోగులు అడగ్గపోయినా సీఎం 27 శాతం ఐఆర్ ఇచ్చారని ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఐఆర్ ఇచ్చి ఉండకపోతే ప్రభుత్వం రూ.18వేల కోట్ల భారంపడి ఉండేది కాదన్నారు. ఐఆర్ ఇవ్వకుండా ఉంటే పెండింగ్‌లో ఉన్న చిన్న కాంట్రాక్టు బిల్లులన్నీ ప్రభుత్వం చెల్లించి ఉండేదన్నారు.ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలపై శ్రీకాంత్‌రెడ్డి స్పందించారు. ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా చూస్తున్నామని ఉద్యోగులను నష్టపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బానిసలుగా చూసి, కించపరిచిన వారిని గత ప్రభుత్వంలో చూశామని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బహిరంగ వేదికలపై ప్రభుత్వ ఉద్యోగులను అవమానించిన పరిస్థితి గతంలో ఉండేదన్నారు. ద్వేషించే వారి ట్రాప్‌లో ఉద్యోగులు పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. హెచ్‌ఆర్‌ఏపై ప్రభుత్వం పునరాలోచన చేస్తుందన్నారు. దీనిపై ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని.. ఇప్పటికే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు పెంచినట్లు గుర్తుచేశారు. ఉద్యోగులు పునరాలోచన చేయాలని.. ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ మొండిగా వ్యవహరిం చదన్నారు. ప్రభుత్వంపై పదివేల కోట్ల భారం పడుతున్నా 23శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామన్నారు. ఉద్యోగులు పీఆర్సీపై తెలంగాణతో పోల్చి చూసుకోవాలని సూచించారు. పక్క రాష్ట్రాల్లో ఎక్కడా ఇంత పీఆర్సీ లేదన్నారు. ఉద్యోగులు తమ వైపు నుంచే కాకుండా ప్రభుత్వం వైపు నుంచి కూడా చూడాల న్నారు. ఉద్యోగులు ఏకపక్షంగా రాజకీయ పార్టీల్లాగా ఆలోచించవద్దని హితవు పలికారు. ఉద్యోగులను చర్చలకు పిలిచి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# ఉద్యోగుల ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు

## ప్రభుత్వం ఉద్యోగ వ్యతిరేక ప్రభుత్వంగా మారింది
## పీఆర్సీ జీవోను వెంటనే రద్దు చేయాలని బిజెపి డిమాండ్

అమరావతి,జనవరి20 : ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. పీఆర్సీ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అద్దెలు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల హెచ్‌ఆర్‌ను ప్రభుత్వం ఎలా తగ్గిస్తుందని సోము వీర్రాజు ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం ఉద్యోగుల ఎనిమీ ప్రభుత్వంగా మారిందన్నారు. గతంలో ఉద్యోగులతో ఏ ప్రభుత్వం కూడా ఇలా వ్యవహరించలేదన్నారు.ఏపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు.మరోవైపు ఆత్మకూరు ఘటనలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని సోము వీర్రాజు మండిపడ్డారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల విషయంలో ఒక్కొక్కరిపై ఒక్కో రకంగా కేసులు పెట్టారని దుయ్యబట్టారు. ముస్లింలకు స్టేషన్ బెయిల్ ఇస్తే.. హిందువు అయిన బీజేపీ కార్యకర్తను మాత్రం రిమాండ్‌కు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని బట్టి వైసీపీ ప్రభుత్వం మతతత్వ ప్రభుత్వమని చెప్పొచ్చని సోము వీర్రాజు అభిప్రాయపడ్డారు. హిందూ వ్యతిరేక విధానాలతో వైసీపీ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శలు చేశారు. ఆత్మకూరు ఘటనలో బీజేపీ నేత శ్రీకాంత్ రెడ్డిని హత్య చేసే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఎస్‌డీపీఐ నేత అతావుల్లాను అరెస్ట్ చేయాలన్నారు. విజయనగరం, రామతీర్థం ఘటనల్లో ఇంత వరకు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయలేదన్నారు. వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేస్తే వెంటనే అరెస్టు చేశారని.. రాముని విగ్రహం ధ్వంసం చేస్తే నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. ముస్లింల చేత వందేమాతరం పాడించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

# గృహహింస కేసులో సంచలన తీర్పు

## బిజెపి నేత కన్నా కోడలికి రూ.కోటి పరిహారం

విజయవాడ,జనవరి20(): గృహహింస కేసులో ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోడలు శ్రీలక్ష్మీ కీర్తికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని విజయవాడలోని ఒకటో చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా నెలకు యాభై వేల రూపాయలను భరణంగా చెల్లించాలని కన్నా కుమారుడిని న్యాయమూర్తి ఆదేశించారు. కోర్టు ఖర్చుల కింద రూ.వెయ్యి ఇవ్వాలంటూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. శ్రీలక్ష్మీ కీర్తి పాపకు అనారోగ్యంగా ఉండడంతో వైద్యానికి శ్రీలక్ష్మీ ఖర్చు చేసిన రూ.50వేలు కూడా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ మొత్తానికి 12శాతం వడ్డీ చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు కన్నా నాగరాజు తన మేనమామ కుమార్తె శ్రీలక్ష్మీ కీర్తిని 2006లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే ఈ పెళ్లి నాగరాజు తల్లి విజయలక్ష్మీకి ఇష్టం లేదు. కానీ వివాహం జరిగిన తర్వాత కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శ్రీలక్ష్మీ కీర్తి 2013లో ఓ పాపకు జన్మనిచ్చింది. అయితే వివాదాల కారణంగా 2015లో తల్లీబిడ్డను ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో బాధితురాలు విజయవాడలోని మెట్రోపాలిటన్ కోర్టును ఆశ్రయించింది. గృహ హింస పిటిషన్ దాఖలు చేయగా విచారించిన కోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిహారంతో పాటు శ్రీలక్ష్మీ కీర్తితో పాటు కుమార్తెకు ఇంట్లో భాగస్వామ్యం కల్పించాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. తీర్పు ఉత్తర్వులు వెలువడిన మూడు నెలల్లోపు ఆదేశాలన్నీ అమలు చేయాలని.. లేకపోతే చర్యలు తప్పవంటూ కోర్టు హెచ్చరికలు జారీ చేసింది.

# కాకినాడ మళ్లీ కేక.. అరుదైన గుర్తింపు..

కాకినాడ జనవరి 20, (న్యూస్ పల్స్) స్మార్ట్‌సిటీ కాకినాడ మరో అరుదైన గుర్తింపును దక్కించుకుంది. ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించే కార్యకలాపాల నిర్వహణకు గాను ఈ గుర్తింపు దక్కింది. వివిధ వర్గాల ప్రజల మధ్య మంచి వాతావరణాన్ని కల్పించడం, పిల్లల్లో పోటీతత్వాన్నిపెంచడం, సామాజిక అంశాలపై యువతలో చైతన్యం పెంపొందించడం వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ నుంచి కాకినాడ స్మార్ట్‌సిటీకి మంగళవారం సమాచారం అందింది.ఈ ప్రక్రియకు దేశంలోని పలు నగరాలను ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక్క కాకినాడకు మాత్రమే చోటు లభించింది. ప్రజల అభిరుచులకు అనుగుణంగా వివిధ రకాల తినుబండారాలను హైజనిక్‌గా ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేయడం, అజాదికా అమృత్ మహోత్సవ్ పేరుతో విద్యార్థుల మధ్యపోటీ పెట్టడం, సైకత శిల్పాల తయారీ, డ్రాయింగ్ పోటీలు సహా అనేక కార్యక్రమాల నిర్వహణ ద్వారా కాకినాడ స్మార్ట్‌సిటీ ప్రత్యేక గుర్తింపును సాధించగలిగింది. ఈ తరహా కార్యకలాపాలను నిర్వహించి అన్ని వర్గాల ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచేలా చేసిన కృషికి ఈ గౌరవాన్ని దక్కించుకోగలిగింది. ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంమరోసారి కాకినాడ స్మార్ట్‌సిటీని మంచిస్థానంలో నిలబెట్టిందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ చెప్పారు.

# బియ్యం పంపిణీలో రేషన్ డీలర్ చేతివాటం

## అప్రమత్తమైన అధికారులు

నంద్యాల జనవరి 20, (న్యూస్ పల్స్)నంద్యాల పట్టణంలో 1384124 రేషన్ షాపు డీలర్ అయిన షేక్ సాయిన్ పర్వీన్ . పై శిక్ష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు . డిసెంబర్ నెలలో పంచాల్సిన కేంద్ర ప్రభుత్వ బియ్యం గోడంగు లలో తగిన నిల్వలు లేక పోవడంతో జనవరి నెల కోటాతో కలిపి రెండు నెలల బియ్యం డీలర్ల కు చేరవేయడం జరిగిందని అన్నారు . డీలర్లు రెండు నెలల బియ్యం కలిసి కార్డు దారులకు పంపిణీ చేయాల్సి ఉంది. . 1384124 షాపు డీలర్ షేక్ సాయిన్ పర్వీన్ షాపు యందు నిల్వలను బట్టి చూస్తే . కార్డు దారులకు ఒక నెలవి మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తోందని అన్నారు . డీలర్ కార్డు దారులకు తెలియదని అనుకున్నోడో ఏమో కానీ ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి పోయింది . వెనువెంటనే అధికారులు . రేషన్ షాపును తనిఖీ చేశారు. ప్రభుత్వం వారు ఇచ్చిన నిల్వ కంటే అధికంగా 16 క్వింటాళ్ల 70 కేజీల బియ్యం అదనంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వెనువెంటనే డీలర్ పై శిక్ష కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి డీలర్ రెండు నెలల బియ్యం కలిపి ఖచ్చితంగా కార్డు దారులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్. మరియు రెవెన్యూ ఇన్ స్పెక్టర్ యుగందర రెడ్డి. వీ ఆర్ ఓ లు పాల్గొన్నారు.

# ఉద్యోగులను నిండా ముంచిన జగన్

## ఇంతటి అధ్వాన్న పాలన గతంలో ఎక్కడా చూడలేదు
## బిజెపి, టిడిపి నేతల ఘాటు విమర్శ

అమరావతి,జనవరి20): ఉద్యోగుల పట్ల, సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రేమ తేటతెల్లమైందని బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగస్తులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా ముంచేసిందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి సిగ్గులేదు.. ప్రతిదీ దగా, మోసం చేస్తుందన్నారు. ఉద్యోగస్తులకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే, వాటినే సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఎప్పుడూ ఇంత దారుణమైన పరిస్థితి ఏ రాష్ట్రంలోనూ చూడలేదన్నారు. ఇలాంటి రాక్షస పాలన చరిత్రలో ఎక్కడ జరగలేదన్నారు.ఈ పోస్ట్ కి జగన్ రాజీనామా చేసి వేరే రాష్ట్రానికి వెళ్లి పాలన చేయాలని హితవు పలికారు. ఏపీలో అన్ని రేట్లను పెంచేసి ఉద్యోగులకు మాత్రం జీతాలు తగ్గిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలో వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభానికి కూడా ముఖ్యమంత్రికి రెండు గంటల సమయం లేదా అని ప్రశ్నించారు. ఇలాంటి గొప్ప వ్యక్తినీ ఏ జన్మలోనూ చూడలేమేమోనని సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి విష్ణుకుమార్ రాజు ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే పీఆర్సీ బిక్ష కాదనే విషయం జగన్ తెలుసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ నేత జవహర్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ జగన్ మోసకారి మాటలను ఉద్యోగులు ఎప్పుడో గుర్తించారని తెలిపారు. సంఘ నాయకులే మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. చరిత్రలో ఇంత చెత్త పీఆర్సీనిచ్చి జగన్ చరిత్రలో నిలిచారని యెద్దేవా చేశారు. జగన్ నమ్మడం ఉద్యోగులకు శాపమైందని పేర్కొన్నారు. జగన్ పాలనలో ఉద్యోగులకు ఒరింగింది ఏమి లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రాపకం కోసం కాకుండా తమ వారి కోసం నాయకులు పని చేయాలని జవహర్ హితవుపలికారు.

# గృహహింస కేసులో సంచలన తీర్పు

## బిజెపి నేత కన్నా కోడలికి రూ.కోటి పరిహారం

విజయవాడ,జనవరి20: గృహహింస కేసులో ఏపీ బీజేపీ మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ కోడలు శ్రీలక్ష్మీ కీర్తికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని విజయవాడలోని ఒకటో చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా నెలకు యాభై వేల రూపాయలను భరణంగా చెల్లించాలని కన్నా కుమారుడిని న్యాయమూర్తి ఆదేశించారు. కోర్టు ఖర్చుల కింద రూ.వెయ్యి ఇవ్వాలంటూ న్యాయస్థానం తీర్పును ఇచ్చింది. శ్రీలక్ష్మీ కీర్తి పాపకు అనారోగ్యంగా ఉండడంతో వైద్యానికి శ్రీలక్ష్మీ ఖర్చు చేసిన రూ.50వేలు కూడా తిరిగి చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ మొత్తానికి 12శాతం వడ్డీ చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. కన్నా లక్ష్మీనారాయణ కుమారుడు కన్నా నాగరాజు తన మేనమామ కుమార్తె శ్రీలక్ష్మీ కీర్తిని 2006లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే ఈ పెళ్లి నాగరాజు తల్లి విజయలక్ష్మీకి ఇష్టం లేదు. కానీ వివాహం జరిగిన తర్వాత కుటుంబంలో వివాదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శ్రీలక్ష్మీ కీర్తి 2013లో ఓ పాపకు జన్మనిచ్చింది. అయితే వివాదాల కారణంగా 2015లో తల్లీబిడ్డను ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో బాధితురాలు విజయవాడలోని మెట్రోపాలిటన్ కోర్టును ఆశ్రయించింది. గృహ హింస పిటిషన్ దాఖలు చేయగా విచారించిన కోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. పరిహారంతో పాటు శ్రీలక్ష్మీ కీర్తితో పాటు కుమార్తెకు ఇంట్లో భాగస్వామ్యం కల్పించాలని కూడా కోర్టు స్పష్టం చేసింది. తీర్పు ఉత్తర్వులు వెలువడిన మూడు నెలల్లోపు ఆదేశాలన్నీ అమలు చేయాలని.. లేకపోతే చర్యలు తప్పవంటూ కోర్టు హెచ్చరికలు జారీ చేసింది. కాగా కన్నా రెండో కోడలు సుహారిక 2020లో అనుమానాస్పదంగా మృతి చెందిన సంగతి తెలిసిందే.

# విపత్కర ,ఆపత్కాల సమయాలలో ఉచిత సేవలు అందించడమే మా లక్ష్యం

## వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్

నెల్లూరు జనవరి 20 విపత్కర ఆపత్కాల సమయాలలో సింహపురి ప్రజలకు ఉచిత సేవలు అందించడమే వైయస్సార్ చారిటీ ఫర్ ద పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ జిల్లా అధ్యక్షులు షేక్ అలీమ్ పేర్కొన్నారు.వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షులుగా షేక్ అలీమ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో శేఖర్ అలీమ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు గుర్తుగా, వైయస్సార్ అభిమానులుగా వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ను వ్యవస్థాపకులు మహమ్మద్ రవూఫ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఆయనతో ఉన్న సేవాబావ సన్నిహితంతో తనను వై ఎస్ ఆర్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థకు జిల్లా అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని ,ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. తన మీద నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలను నెరవేరుస్తూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా, ప్రజల సంక్షేమం కోసం తన వంతు కృషి చేయడమే కాకుండా, వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ బలోపేతానికి శక్తివంచన లేకుండా తన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆపత్కాల, విపత్కర సమయాలలో సింహపురి ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు . పేద ,బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందించేందుకు వెనకాడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే సంస్థలో 82 మంది పైచిలుకు యువతీ యువకులు సభ్యత్వం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. సేవాభావం కలిగి, తమ వంతు బాధ్యతగా ఉచిత సేవలు అందించేందుకు ఆసక్తిగల యువతీ యువకులను ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో షేక్ .ఇంతియాజ్, షేక్. షబ్బీర్, షేక్. మన్సూర్, షేక్. అవిహద్ , షేక్ .మహీం తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ వర్గానికి అన్ని విధాలుగా అందుబాటులో ముద్రించిన ఉర్దూ క్యాలెండర్

## ఆప్ కి అవాజ్ ఉర్దూ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష....

కడప జనవరి 20 ఆప్ కి అవాజ్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి అంజాద్ భాష చేతుల మీదుగా ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ ముద్రించిన ఉర్దూ క్యాలెండర్ ఆవిష్కరించటం జరిగింది. అనంతం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆప్ కి ఆవాజ్ ఉర్దూ క్యాలెండర్ ను ముద్రించినటువంటి ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సంస్థ మైనారిటీల హక్కులకోసం ప్రభుత్వం నుండి రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులకోసం పోరాటం చేస్తుంది నేటి పరిస్థితులలో ముస్లింల పట్ల వారి హక్కుల పట్ల వారిపై దాడులు జరుగుతుంటే వారికి కాపాడటం కోసం పోరాటం చేసే సంస్థ ఆప్ కి ఆవాజ్ అని ఆయన అన్నారు. నిరంతరంమైనారిటీల కోసం మైనారిటీ హక్కుల కోసం నిరంతరం పాటు పడుతున్న టువంటి ఆప్ కి ఆవాజ్ కమిటీకి అభినందించారు నిరంతరం పోరాటం చేస్తూ ముందుకు పోవాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆయన అన్నారు. కమిటీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఏడాది ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉర్దూ ఇస్లామిక్ క్యాలెండర్ ను ముద్రించటం ముస్లింల నివాసాలు ఇండ్లల్లో ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బుల్ భాష మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మైనారిటీ ల పైన విపరీతమైన దాడులు జరుగుతున్నాయని నిరంతరం ఏదో ఒక ప్రాంతంలో ముస్లింలపై దళితులపై క్రిస్టియన్ల పై మతోన్మాద దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, వీటిని ఖండించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ రోజు దేశంలో లౌకిక వాదుల పై ప్రజాస్వామ్య వాదులపై మతోన్మాద దాడులు ఈ విధంగా పెరిగిపోయాయని ఆయన అన్నారు. నేడు ఉన్నటువంటి పరిస్థితుల్లో దేశంలో లౌకిక వాదులు ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని లౌకిక ప్రజాస్వామ్య దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టే పార్టీలను ఈ దేశం నుండి తరిమివెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. వీటన్నింటిపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆప్ కి ఆవాజ్ ఉర్దూ క్యాలెండర్ ను ఆవిష్కరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ భాష గారికి రాష్ట్ర కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు అదేవిధంగా మా సంస్థకు అన్ని విధాలుగా చేదోడువాదోడుగా సహకరించిన మిత్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో ఆప్ కి అవాజ్ జిల్లా కార్యదర్శి ఫయాజ్, నాయకులు ఖాజా హుస్సేన్, నూర్ మహమ్మద్, జిల్లా నాయకులు ఇమ్రాన్, ఉస్మాన్, షబ్బీర్ అహ్మద్, ఆర్ ఎస్ వై యస్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, వై ఎస్ ఆర్ సి పి 28 వ డివిజన్ కార్పొరేటర్ ఆరిఫ్ పుల్లా, నాయకులు మియా తదితరులు పాల్గొన్నారు.

# పెండేకల్ కాసిం స్వామి దర్గాకు విరాళం అందజేసిన అట్ల ప్రమోద్ కుమార్ రెడ్డి

తుగ్గలి తుగ్గలి మండలం పరిధిలోని పండగల గ్రామంలో కాసిం స్వామి ఉరుసు కు గ్రామ ప్రజలు సర్వం సిద్ధం చేశారు. కాసిం స్వామి ఉరుసు సందర్భంగా గ్రామంలో పలు క్రీడా పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే కాసిం స్వామి ఉరుసుకు సర్వం సిద్ధం చేసినట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. కాసిం స్వామి ఉరుసు సందర్భంగా గురువారం రోజున సీనియర్ న్యాయవాది అట్లా మురహరి రెడ్డి కుమారుడు పత్తికొండ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ అట్లా ప్రమోద్ కుమార్ రెడ్డి కాసిం స్వామి దర్గాకు ఒక లక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా గ్రామ పెద్దలకు అందజేశారు.

# జుట్టు రఫ్ గా ఉందా? మీరు ఈ నియమాన్ని పాటిస్తే, మీరు సులభంగా ప్రయోజనాలను పొందుతారు!



ముఖ్యంగా చలికాలంలో వాతావరణం వల్ల మన జుట్టు చాలా గరుకుగా మారుతుంది. కాబట్టి ఈ సమయంలో మీరు మీ జుట్టును మరింత జాగ్రత్తగా చూసుకోవాలి. ఈరోజు నుండి కొంత సమయం కేటాయించి మీ జుట్టును జాగ్రత్తగా చూసుకోండి.మీ జుట్టు యొక్క సహజ తేమ స్థాయిలు సీజన్‌లను బట్టి మారుతున్నందున, మీరు మీ జుట్టును క్రమం తప్పకుండా మాయిశ్చరైజ్ చేయాలి.చలికాలంలో ఉష్ణోగ్రత పడిపోవడంతో మీ జుట్టు పొడిబారుతుంది. చల్లటి గాలితో పాటు ఇంట్లో హెయిర్ హీటర్లను వాడటం వల్ల జుట్టు పొడిబారడంతోపాటు డ్యామేజ్ అవుతుంది.ఎ) తలలో చర్మం తగినంత నూనెను ఉత్పత్తి చేయదుబి) హెయిర్ డ్రైయర్, స్ట్రెయిట్‌నర్, కర్లింగ్ ఐరన్ జుట్టును పాడు చేస్తుందిసి) జుట్టు రంగు మరియు ఇతర రసాయన చికిత్సడి) మీ జుట్టును ఎక్కువగా షాంపూ చేయండిఇ) షాంపూ చేసిన తర్వాత కండీషనర్‌ని ఉపయోగించవద్దుఈ) జుట్టు ఎక్కువగా కడగడంజి) మారిన వాతావరణంఊ) నాణ్యత లేని బ్రష్‌లు మరియు దువ్వెనలు ఉపయోగించడంఈ కారణాల వల్ల, మీ జుట్టు తాజాదనాన్ని కోల్పోవచ్చు, దాని ప్రకాశాన్ని కోల్పోవచ్చు మరియు నిస్తేజంగా మారవచ్చు. కాబట్టి జుట్టులోని తేమను తిరిగి పొందాలంటే జుట్టుకు మాయిశ్చరైజ్ చేయాలి. జుట్టును మాయిశ్చరైజ్ చేయడానికి సహాయపడే అంశాలను కనుగొనండి.కొబ్బరి నూనెలో ఉండే మాయిశ్చరైజింగ్ పదార్థాలు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. ఇది జుట్టును మృదువుగా మరియు కాంతివంతంగా ఉంచుతుంది.కొబ్బరి నూనెతో జుట్టు మరియు తలకు బాగా మసాజ్ చేయండి. కొన్ని నిమిషాల పాటు మసాజ్ చేసిన తర్వాత సుమారు గంటసేపు అలాగే ఉంచండి. మీ జుట్టును తక్కువ షాంపూతో కడగాలి. తర్వాత కండీషనర్ అప్లై చేయండి. మీరు కొబ్బరి నూనెను వారానికి 1-2 సార్లు ఉపయోగించవచ్చు.అరటిపండు మరియు ఆలివ్ ఆయిల్ జుట్టును హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడే మాయిశ్చరైజింగ్ పదార్థాలను కలిగి ఉంటాయి.

జుట్టును మృదువుగా చేస్తుంది.ఎలా ఉపయోగించాలి:1 పండిన అరటి1-2 టేబుల్ స్పూన్లు ఆలివ్ నూనెనూనె మరియు అరటిని కలపండి. పొడి జుట్టు మరియు నెత్తిమీద పేస్ట్‌ను వర్తించండి. 15 నిమిషాలు ఉంచండి. అప్పుడు మీరు దానిని నీటితో కడగాలి. మీరు వారానికి ఒకసారి ఈ ప్యాక్‌ను అప్లై చేసుకోవచ్చు.తేనె చాలా మంచి మాయిశ్చరైజర్ మరియు హెయిర్ కండీషనర్‌గా పనిచేస్తుంది. గుమ్మడి గింజల నూనె జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.ఎలా ఉపయోగించాలి1 టేబుల్ స్పూన్ గుమ్మడికాయ విత్తన నూనె2 టేబుల్ స్పూన్లు తేనె2 టేబుల్ స్పూన్లు కొబ్బరి నూనెప్రతిదీ బాగా కలపండి. 15-20 నిమిషాలు తడి జుట్టు మీద వర్తించండి. అప్పుడు మీ జుట్టును తేలికపాటి షాంపూతో కడగాలి. సహజంగానే కండీషనర్ వర్తించండి. మీరు వారానికి 1-2 సార్లు దరఖాస్తు చేస్తే మీరు ప్రయోజనం పొందుతారు.షియా బటర్ జుట్టుకు గ్రేట్ గా సహాయపడుతుంది. ఇది పొడి మరియు దెబ్బతిన్న జుట్టును మెరుగ్గా చేయడానికి సహాయపడుతుంది.1-2 టేబుల్‌స్పూన్ల షియా బటర్‌ను వేడి చేసి తలకు మరియు జుట్టుకు అప్లై చేయండి. మృదువుగా మసాజ్ చేసి 30 నిమిషాలు అలాగే ఉంచండి. అప్పుడు మీ జుట్టును తేలికపాటి క్లెన్సర్‌తో కడగాలి. తర్వాత కండీషనర్ అప్లై చేయండి. మీరు దీన్ని వారానికి 1-2 సార్లు చేయవచ్చు.కలబంద యొక్క ఫోటోప్రొటెక్టివ్ ప్రభావం జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. లావెండర్ ఆయిల్ జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది.1/4 కప్పు అలోవెరా జెల్, 1 కప్పు నీరు, 2-3 చుక్కల లావెండర్ ఆయిల్ముందుగా అలోవెరా జెల్‌ని ఒక కప్పు నీటిలో కలపండి. లావెండర్ నూనె జోడించండి. మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోయాలి. జుట్టు మరియు తలపై అవసరమైన విధంగా స్ప్రే చేయండి.ఈ చిట్కాలు జుట్టు రాలడాన్ని అరికట్టవచ్చు. మీరు దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగిస్తే, మీ పొడి-రఫ్ జుట్టు మృదువుగా మారినట్లు మీరు చూస్తారు.



# 'ది వారియర్' కోసం ఇస్మార్ట్ బాడీని రెడీ చేసిన రాపో..!




'దేవదాస్' సినిమాతో ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన రామ్ పోతినేని.. ఫస్ట్ మూవీతోనే ఎనర్జిటిక్ హీరో అనిపించుకున్నారు. కెరీర్ ప్రారంభం నుంచీ రామ్ ఎన్ని మాస్ సినిమాలు చేసినా.. చాక్లెట్ బాయ్ లాగే కనిపిస్తూ వచ్చారు. అయితే 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో పూరీ జగన్నాథ్ యువ హీరోని పూర్తిగా అవతారంలోకి తీసుకొచ్చాడు.ఊర మాస్ లుక్ లోకి మారిపోయిన రామ్.. భారీ వర్కౌట్స్ చేసి సిక్స్ ప్యాక్ బాడీతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఉస్తాద్ లుక్ అండ్ ఇస్మార్ట్ గెటప్ మాస్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. అయితే ఇప్పుడు రాపో మరోసారి తన బాడీని చూపించడానికి రెడీ అయ్యారని తెలుస్తోంది.రామ్ ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లింగుస్వామితో "ది వారియర్" అనే తెలుగు తమిళ ద్విభాషా చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో రామ్ పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు.ఉస్తాద్ హీరో క్లీన్ షేవ్ తో ఖాకీ యూనిఫామ్ లో అగ్రెసివ్ లుక్ లో కనిపించాడు. రామ్ కెరీర్ లో పోలీస్ గా కనిపించడం ఇదే తొలిసారి. యాంగ్రీ యంగ్ మ్యాన్ పాత్ర కోసం రామ్ ఫిజికల్ గా చాలా వర్కవుట్స్ చేసినట్లు తెలుస్తోంది.పోలీసాఫీసర్ పాత్ర అంటే చాలా ఫిట్ గా కనిపించాల్సి ఉంటుంది. దీని కోసం రామ్ కొన్ని నెలల పాటు జిమ్ లో తీవ్రంగా శ్రమించి బాడీని బిల్డ్ చేసినట్లు తెలిసింది. కండలు తిరిగిన ఆరు పలకల దేహాన్ని కూడా రెడీ చేసారని టాక్. 'ఇస్మార్ట్ శంకర్' క్లైమాక్స్ మాదిరిగానే.. 'ది వారియర్' సినిమాలో రామ్ తన బాడీని చూపించబోతున్నారని సమాచారం.'ది వారియర్' చిత్రంతో కోలీవుడ్ లో సాలిడ్ ఎంట్రీ ఇవ్వాలని రామ్ ప్లాన్ చేసుకున్నారు. ఇందులో కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుండగా.. ఆది పినిశెట్టి విలన్ గా కనిపించనున్నారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తుండగా.. సుజీత్ వాసుదేవ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి భారీ బడ్జెట్ తో ఈ బైలింగ్వల్ మూవీని నిర్మిస్తున్నారు.


# ఆస్ట్రేలియా ప్రభుత్వంపై పరువునష్టం దావా.. ఏకంగా 32 కోట్లకు..!



వ్యాక్సిన్ తీసుకోలేదన్న కారణంగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తనను ఆడనీయకుండా అడ్డుకున్న ఆస్ట్రేలియా ప్రభుత్వంపై ప్రపంచ నెంబర్ వన్ టెన్నిస్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమయ్యాడు. స్కాట్ మోరిసన్ ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించుకున్నాడు. తన 21వ గ్రాండ్‌స్లామ్ కలకు అడ్డుకట్ట వేయడంతో పాటు బలవంతంగా క్వారంటైన్‌కు తరలించడాన్ని కారణాలుగా చూపుతూ 32 కోట్ల రూపాయలకు దావా వేయాలని డిసైడయ్యాడు. దీనిపై ప్రస్తుతం లాయర్లతో చర్చిస్తున్నాడు. కాగా, ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ ఆడేందుకు మెల్ బోర్న్ వెళ్ళిన జకోవిచ్‌ను కరోనా వ్యాక్సిన్ తీసుకోని కారణంగా ఎయిర్ పోర్టులోనే అడ్డుకున్న సంగతి తెలిసిందే. జకో.. టోర్నీలో పాల్గొనేందుకు నిర్వాహకులు అనుమతించినప్పటికీ, ఆ దేశ ప్రజల నుంచి భారీ ఎత్తున నిరసనలు వెల్లువెత్తడంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం అతన్ని బలవంతంగా క్వారంటైన్‌కు తరలించింది. వ్యాక్సిన్ తీసుకోని కారణంగా అతన్ని దేశంలోకి అనుమతించలేమని, అలాగే అతని వీసాను కూడా రద్దు చేస్తున్నామని స్పష్టం చేసింది. దీనిపై కోర్టును ఆశ్రయించిన జకోకు మొదట్లో ఉపశమనం లభించినా.. ఆతర్వాత ఆస్ట్రేలియా ప్రభుత్వాన్నే విజయం వరించింది.ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్న జకో.. స్వదేశానికి వెళ్లగానే ఆస్ట్రేలియా ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే భారీ మొత్తంలో పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రైజ్‌మనీతో పోలిస్తే అతను దావా వేయాలనుకున్న మొత్తం చాలా ఎక్కువ. ఇదిలా ఉంటే, ఈ సెర్బియన్ యోధుడు ఇటీవలే ఔషధ తయారీ రంగంలోకి కూడా అడుగుపెట్టినట్లు తెలుస్తోంది. అతనికి కోవిడ్ విరుగుడు మందు తయారు చేసే క్వాంట్ బయోరెస్ అనే ఔషధ తయారీ సంస్థలో 80 శాతం వాటా ఉన్నట్లు సదరు కంపెనీ సీఈఓ స్వయంగా వెల్లడించాడు.

# 2022-23 సంవత్సరాలు మెగా ఫ్యాన్స్ కు చాలా స్పెషల్

ఈమధ్య కాలంలో స్టార్ హీరోలు ఏడాదికి ఒక్క సినిమా చేస్తేనే గొప్ప విషయం అన్నట్లుగా పరిస్థితి ఉంది. అలాంటిది రెండు సినిమాలు చేస్తే మా హీరో గ్రేట్ అంటూ అభిమానులు సంకలు గుద్దేసుకుంటున్నారు. ఇక మూడు సినిమాలు చేస్తే దేవుడు అంటున్న రోజులు ఇవి. అలాంటిది రాబోయే రెండేళ్లలో మెగా స్టార్ చిరంజీవి నుండి ఏకంగా ఏడు సినిమాలు రాబోతున్నాయి. ఏడు సినిమా లకు ఒకటి ఎక్కువే కాని తక్కువ కాకుండా చిరంజీవి ఈ ఏడాది వచ్చే ఏడాది కలిపి సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇప్పటికే విడుదల అవ్వాల్సి ఉండి వాయిదా పడ్డ ఆచార్య మొదలుకుని ఇంకా మొదలు కాని మారుతి మరియు వెంకీ కుడుముల సినిమాల వరకు చిరంజీవి చేయబోతున్న సినిమాలన్నీ కూడా ఈ ఏడాది మరియు వచ్చే ఏడాదికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.ఈ ఏడాది లో ఆచార్య విడుదల కాబోతుంది. ఆచార్య చిత్రం కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిన విషయం తెల్సిందే. చిరంజీవి ఇప్పటికే గాడ్ ఫాదర్.. భోళా శంకర్ మరియు వాల్తేరు వాసు సినిమాలను మొదలు పెట్టాడు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్న సినిమాల్లో ఒకటి లేదా రెండు సినిమాలు అయినా ఈ ఏడాది విడుదల అవ్వబోతున్నాయి. ఆచార్య సినిమా ఈ సమ్మర్ లో విడుదల కాబోతుంది. కనుక దసరాకు మెగా స్టార్ మూవీ ఉండే అవకాశాలు ఉన్నాయి. ఏ సినిమాకు అయినా మూడు నాలుగు నెలల కంటే ఎక్కువ సమయం కేటాయించాలని చిరంజీవి భావించడం లేదు. ఆచార్య సినిమా ను కూడా వంద వర్కింగ్ డేస్ లో పూర్తి చేయాలని చిరంజీవి అనుకున్నాడు. కాని కరోనా ఇతర కారణాల వల్ల సినిమా షూటింగ్ పూర్తి అయినా కూడా విడుదలకు నోచుకోవడం లేదు.ఆచార్య సినిమా తర్వాత రాబోతున్న సినిమాల జాబిత చెప్తే మెగా అభిమానులకు పూనకాలే అనడంలో




సందేహం లేదు. గాడ్ ఫాదర్ సినిమా ముగింపు దశకు వచ్చింది కనుక ఆచార్య తర్వాత ఆ సినిమాను విడుదల చేస్తారని అంటున్నారు. గాడ్ ఫాదర్ చిత్రం తర్వాత బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాతో చిరంజీవి వస్తాడని అంటున్నారు. ఆ తర్వాత మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న భోళా శంకర్ సినిమా కూడా విడుదల కాబోతుంది. ఇదే సమయంలో మారుతి.. వెంకీ కుడుముల మరియు అనీల్ రావిపూడి దర్శకత్వంలో కూడా చిరంజీవి కూడా సినిమాలును చేయబోతున్నాడు. ఈ మొత్తం సినిమాలు రాబోయే రెండేళ్లలోనే రాబోతున్నాయి. కనుక ఈ రెండేళు మెగా ఫ్యాన్స్ కు చాలా స్పెషల్ అనడం లో సందేహం లేదు. ఈ రెండేళ్లలో చిరంజీవివి ఏడు సినిమాలు మాత్రమే కాకుండా రామ్ చరణ్.. అల్లు అర్జున్.. సాయి ధరమ్ తేజ్.. వైష్ణవ్ తేజ్ మరియు ఇతర మెగా హీరోల సినిమాలు కూడా చాలానే వస్తాయి.

# ఐసీసీ టెస్టు జట్టులో రోహిత్, పంత్, అశ్విన్.. కోహ్లికి దక్కని చోటు

ఐసీసీ టెస్టు జట్టు 2021లో టీమిండియా నుంచి ముగ్గురు ఆటగాళ్లకు చోటు దక్కింది. ఓపెనర్‌గా రోహిత్ శర్మ, వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్, స్పిన్నర్‌గా రవిచంద్రన్ అశ్విన్‌లు స్థానం సంపాదించగా.. ఇటీవలే టెస్టు కెప్టెన్సీ నుంచి వైదొలిగిన కోహ్లికి మాత్రం స్థానం దక్కలేదు.గతేడాది తొలిసారి నిర్వహించిన ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌లో న్యూజిలాండ్‌ను విజేతగా నిలిపిన కేన్ విలియమ్సన్‌కు కెప్టెన్‌గా అవకాశం దక్కగా... అదే మ్యాచ్‌లో బౌలింగ్‌లో మెరిసిన కైల్ జేమీసన్‌కు జట్టులో చోటు లభించింది.డబుల్ సెంచరీతో ఆకట్టుకున్న దిముత్ కరుణరత్నే(శ్రీలంక) రెండో ఓపెనర్‌గా.. ఆస్ట్రేలియాకు చెందిన మార్నస్ లబుషేన్, ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ మిడిలార్డర్‌లో.. పాకిస్తాన్ నుంచి పవాద్ ఆలమ్, షాహిన్ అఫ్రిది, హసన్ అలీలు చోటు దక్కించుకున్నారు. కాగా ఇప్పటికే ప్రకటించిన ఐసీసీ వన్డే, టి20 జట్టులో టీమిండియా నుంచి ఒక్క ఆటగాడికి కూడా చోటు దక్కలేదన్న సంగతి తెలిసిందే.ఐసీసీ పురుషుల టెస్టు జట్టు 2021: దిముత్ కరుణరత్నే (శ్రీలంక), రోహిత్ శర్మ (భారత్), కేన్ విలియమ్సన్ (కెప్టెన్, న్యూజిలాండ్), మార్నస్ లబుషేన్ (ఆస్ట్రేలియా), జో రూట్ (ఇంగ్లండ్), ఫవాద్ ఆలం (పాకిస్తాన్), రిషబ్ పంత్ ( భారత్), రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కైల్ జేమీసన్ (న్యూజిలాండ్), షాహిన్ షా అఫ్రిది (పాకిస్థాన్), హసన్ అలీ (పాకిస్థాన్)?ఇక ఐసీసీ టెస్టు జట్టులో ఓపెనర్‌గా చోటు దక్కించుకున్న రోహిత్ గతేడాది




క్యాలెండర్ ఇయర్‌లో 47.68 సగటుతో 906 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. రోహిత్ సాధించిన రెండు సెంచరీల్లో ఒకటి స్వదేశంలో(చెన్నైలో), మరొకటి విదేశంలో(ఓవల్) వచ్చాయి. ఈ రెండు సందర్భాల్లో ఇంగ్లండ్ ప్రత్యర్థి కావడం విశేషం.?టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్.. గతేడాది కాలంలో అన్ని ఫార్మాట్లలోనూ రెగ్యులర్ వికెట్ కీపర్‌గా మారిపోయాడు. 12 టెస్టుల్లో 748 పరుగులు సాధించిన పంత్‌కు ఒక సెంచరీ ఉంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190